తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | మహబూబాబాద్ | నిర్మల్ | మంచిర్యాల | కొమురం భీం ఆసిఫాబాద్
పేజీలు : 15
బుధవారం
16 సెప్టెంబర్ 2026
Follow :



## అక్రమంగా గుడుంబా

### అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**ఆత్మకూర్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి)** ఆత్మకూర్ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సమాచారం మేరకు ఆత్మకూర్ గ్రామములో ఇద్దరు వ్యక్తులు తోట రాములు తండ్రి నర్సయ్య, వయస్సు: 70 సంవత్సరాలు, గుండెబోయిన రాధిక, భర్త శ్రీనివాస్, వయస్సు: 45 ఆత్మకూర్ గ్రామం వారు గుర్తు తెలియని వ్యక్తుల వద్ద అక్రమంగా గుడుంబా కొని అమ్ముతుమన్నారని తెలవగా ఇద్దరినీ అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి మొత్తం 46 లీటర్ల అక్రమ గుడుంబాను స్వాధీనం చేసుకోగా, దాని విలువ సుమారు రూ. 18,400/- విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు. విచారణలో వారు గుడుంబాను అక్రమంగా విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ఇరువురిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగింది. అక్రమంగా గుడుంబా తయారీ, నిల్వ లేదా విక్రయానికి పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని పోలీసులు హెచ్చరించారు.

## కదలని వెలిశాల--పెద్దంపల్లి రోడ్డు!

**రెండు ప్రభుత్వాలు.. రెండు శిలాఫలకాలు..**
**రూ.3.50 కోట్లకుపైగా ప్రతిపాదనలు..**
**పనులు మాత్రం శిలాఫలకాలకే పరిమితం..**
**వర్షాలతో బురదమయంగా మారిన రహదారి**
**నరకయాతన పడుతున్న మూడు గ్రామాల ప్రజలు**





టేకుమట్ల, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):
శిలాఫలకాలు వేశారు.. హామీలు ఇచ్చారు.. నిధులు మంజూరు చేశామని ప్రకటించారు.. కానీ రోడ్డు మాత్రం వేయలేదు. ప్రభుత్వాలు మారుతున్నా.. ఎమ్మెల్యేలు మారుతున్నా.. వెలిశాల--పెద్దంపల్లి--రాఘవాపూర్ రహదారి దుస్థితి మాత్రం మారడం లేదు. ఒకే రోడ్డుకు రెండు ప్రభుత్వాల హయాంలో రెండు శిలాఫలకాలు వెలిసినా, ప్రజలకు మాత్రం ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. దీంతో "శిలాఫలకాలు వేయడానికేనా నిధులు.. రోడ్డు ఎప్పుడు వేస్తారు?" అంటూ వెలిశాల రామకృష్ణాపూర్ వి పెద్దంపల్లి గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

మెయిన్‌లో..

## చీరలతో వినాయకుడు..!

5 వేల కొత్త చీరలతో భారీ వినాయక విగ్రహం

16 అడుగుల వెడల్పు.. 32 అడుగుల ఎత్తు

సుమారు రూ.20 లక్షల వ్యయంతో రూపకల్పన

వరంగల్‌లోనే కాదు.. తెలంగాణలోనే తొలిసారిగా వినూత్న ప్రయోగం

మెయిన్‌లో..



## తాటికొండ గౌడ సంఘ అధ్యక్షుడిగా బొంగోని యాదగిరి గౌడ్



**స్టేషన్ ఘన్ పూర్,సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** మండలంలోని తాటికొండ గ్రామంలో గౌడ సంఘం కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడిగా బొంగోని యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షునిగా దేశిని రమేష్ గౌడ్, కార్యదర్శిగా ఐలోని రాజు గౌడ్ డైరెక్టర్లుగా బూరుగు ప్రసాద్ గౌడ్, పొన్నం సతీష్ గౌడ్, పాలకుర్తి నాగరాజు గౌడ్, కోరుకొ ప్పుల మహేందర్ గౌడ్,దుబ్బాక నాగరాజు, ఉమ్మగొని రాజు గౌడ్,మూషిని రాజయ్య గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వీరికి సహకరించిన గౌడ సంఘ కుల పెద్దలకు, సభ్యులకు గౌడ సంఘం అధ్యక్షుడు బొంగోని యాదగిరి గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.

## అనారోగ్యంతో పురోహితుని మృతి



**వరంగల్ ఈస్ట్ ( జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని రంగసాయిపేట 42వ డివిజన్ కు చెందిన పురోహితుడు మల్లోజుల ప్రదీప్ శాస్త్రి (43) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతునికి భార్య ఉంది. రంగసాయిపేట ప్రాంతంలో అందరికీ సుపరిచితులైనటువంటి ప్రదీప్ శాస్త్రి మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు కొల్లూరు యోగానంద్ పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దున్నాల విజయ్, మండల మొగిలి, సోమ అనిల్, చిదురాల మధు తదితరులు ప్రదీప్ శాస్త్రి పార్థివ దేహం సందర్శించి నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

## భార్యపై హత్య ప్రయత్నం

### భర్తను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచిన టేకుమట్ల ఎస్సై జి అమూల్య

**టేకుమట్ల సెప్టెంబర్ 15 జనంసాక్షి**

టేకుమట్ల మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన దొంగల కోమల కు మొగుళ్లపల్లి మండలం పెద్ద కోమటిపల్లి గ్రామానికి చెందిన దొంగల రాజేందర్‌తో ఆరు సంవత్సరాల క్రితం వివాహమైనది వీరి సంసారజీవితంలో ఇద్దరు కొడుకులు పెద్ద కొడుకు ఐదు సంవత్సరాలు చిన్న కొడుకు మూడు సంవత్సరాలు పిల్లలు ఉన్నారు గత రెండు సంవత్సరాలనుండి రాజేందర్ మద్యం సేవించి కోమల ను శారీరకంగా మానసికంగా వేదించిగా ఇటీవల భర్త బాధ భరించలేక పుట్టింటి ఆరెపల్లి కి రాగ,, రాజేందర్ ఇట్టి విషయంలో కోమల మీద కోపం పెంచుకొని తేది 01-09-2026న రాజేందర్ మద్యం సేవించి ఆరెపల్లి గ్రామంలోని లోని కోమల ఇంటికి వచ్చి భార్య కోమల తో గొడవ పడి కత్తి తో పొడిచి చంపే ప్రయత్నం చేయగా కోమల చెయ్యి అడ్డుపెట్టగా చేతి మీద నడుము మీద కత్తి పోడవగా గాయాలైనట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు అనంతరం నిందితుడి కోసం గాలింపు చర్యలో భాగంగా రాఘవరెడ్డి పేట్ శివారులో వాహనాల తనిఖీలు చేస్తున్న సందర్భంగా రాజేందర్ పోలీస్ వారిని చూసి పరిగెడుతున్న సమయంలో రాజేందర్ ను పట్టుకొని పట్టుకొని విచారణ చేసి కోర్టు కు హాజరు పర్చినట్లు టేకుమట్ల ఎస్సై జి . అమూల్య తెలిపారు

## డబ్బులిస్తేనే లిస్టులో పేరు

మెయిన్‌లో..

ఇందిరమ్మ కమిటీలకు తగ్గిన ప్రాధాన్యత.. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ఇష్టారాజ్యం

## నడిరోడ్డుపై చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య

మెయిన్‌లో..

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

## డిప్యూటీ తహాశిల్దార్‌కు బీజేపీ వినతిపత్రం



**తాండూర్, సెప్టెంబర్ 15(జనం సాక్షి)** సెప్టెంబర్ 17న తెలంగాణ స్వాతంత్ర దినోత్సవ (విమోచన దినోత్సవ) వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకుండా, కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ ప్రభుత్వాలు తెలంగాణ ప్రజలను వంచనకు గురిచేశాయని బీజేపీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు మంగళవారం తాండూర్ మండల కేంద్రంలో స్థానిక డిప్యూటీ తహాశిల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా నిజాం నిరంకుశ పాలనలో మగ్గిన తెలంగాణ ప్రాంతానికి.. సెప్టెంబర్ 13, 1948న సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రారంభించిన 'ఆపరేషన్ పోలో' సైనిక చర్య ద్వారా సెప్టెంబర్ 17, 1948న విముక్తి లభించిందని గుర్తుచేశారు. తెలంగాణతో పాటు స్వాతంత్ర్యం పొందిన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో అక్కడి ప్రభుత్వాలు ఈ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నాయని, కానీ తెలంగాణలోని రాజకీయ పార్టీలు మైనార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతూ నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక కేవలం గోల్కొండ ఖిల్లాపై ఉత్సవాలు జరిపి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం 'ప్రజా పాలన దినోత్సవం' పేరుతో అసలైన విమోచన చరిత్రను మరుగున పడేసేందుకు ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల అభీష్టం మేరకు కేంద్ర ప్రభుత్వం 2023 నుండి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందని, అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిని అధికారికంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజాం నవాబు పాలనలో 13 నెలల పాటు తెలంగాణ ప్రజలు అనుభవించిన బానిస జీవితాన్ని, విమోచన పోరాట చరిత్రను తెలంగాణ పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల కార్యదర్శి గాదె రాజేశం, సీనియర్ నాయకులు కోమండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# ప్రమాదకరంగా పల్లె వెలుగు ప్రయాణం

## బస్సుకు వెనుక అద్దం లేకపోవడంతో ప్రయాణికుల ఆందోళన



**తాండూర్, సెప్టెంబర్ 15(జనం సాక్షి)** మంచిర్యాల/ఆసిఫాబాద్: మంచిర్యాల నుండి ఆసిఫాబాద్ రూట్‌లో నడుస్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల భద్రత గాల్లో దీపంగా మారింది. ఆసిఫాబాద్ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు వెనుక భాగంలో రక్షణ అద్దం లేకుండానే రోడ్లపై ప్రమాదకరంగా నడుస్తోంది. బస్సుకు కనీస రక్షణ కవచం లాంటి అద్దం లేకపోవడంతో వెనుక నుండి వచ్చే వాహనాలను గమనించడం డ్రైవర్‌కు అత్యంత కష్టతరంగా మారింది. ముఖ్యంగా ఈ రూట్‌లో భారీ వాహనాలు, వేగంగా వచ్చే బైక్‌లను గమనించకుండా అకస్మాత్తుగా బ్రేకులు వేస్తే తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు జరిగే ముప్పు ఉందని ప్రయాణికులు మరియు వాహనదారులు తీవ్ర భయాందోళనలు వ్యక్తంచేస్తున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణించే పల్లె వెలుగు బస్సుల నిర్వహణలో ఆర్టీసీ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రయాణిక సంఘాలు మండిపడుతున్నాయి. ఏదైనా పెద్ద ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు మరియు ఆసిఫాబాద్ డిపో మేనేజర్ తక్షణమే స్పందించి, సదరు బస్సుకు అద్దాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగునీరు..

# నరకప్రాయంగా బోయపల్లి ఎస్సీ కాలనీవాసుల జీవితాలు



**తాండూర్, సెప్టెంబర్ 15(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం బోయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు, సరైన మురుగునీటి కాల్వలు లేకపోవడంతో వర్షపు నీరు, ఇండ్ల నుంచి వచ్చే మురుగునీరు అంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో కాలనీలోని రహదారులు పూర్తిగా జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. రహదారులపై మోకాళ్ళ లోతు నీరు నిలవడంతో కాలనీవాసులు, వాహనదారులు, ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఇండ్ల నుండి బయటకు రాలేని దుస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాలన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నడవాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రబలుతున్న అంటువ్యాధులు -- భయాందోళనలో ప్రజలు:రోజుల తరబడి మురుగునీరు రోడ్లపైనే నిలిచిపోతుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని, దోమలు విపరీతంగా పెరిగిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఇప్పటికే పలువురు జ్వరాల బారిన పడ్డారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించాలి:సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుని జిల్లా కలెక్టర్ , పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బోయపల్లి ఎస్సీ కాలనీలో యుద్ధప్రాతిపదికన పర్యటించి, శాశ్వత సీసీ డ్రైనేజీ వ్యవస్థను, రహదారులను నిర్మించి తమ ప్రాణాలు కాపాడాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

## ఊరూరా బొజ్జ గణపయ్య నామస్మరణ

# ఘనంగా గణేష్ ఉత్సవాలు ఆరంభం



**ఖానాపూర్ సెప్టెంబర్ 15 (జనం సాక్షి)** గణేష్ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా వినాయక విగ్రహాలను ప్రతిష్టించడంతో గ్రామాలు, పట్టణాలు భక్తిపారవశ్యంలో మునిగిపోయాయి. చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా భక్తులందరూ ఉత్సాహంగా పాల్గొంటూ తమ భక్తిప్రపత్తులను చాటుకుంటున్నారు. ప్రతి మండపం వద్ద ప్రత్యేక అర్చకులను నియమించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలు, ప్రత్యేక అలంకరణలతో మండపాలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. పోలీసులు ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రత్యేక నిఘా విభాగం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మండపాల వద్ద ప్రమాదాలు జరగకుండా అతుకులు లేని విద్యుత్ తీగలను మాత్రమే వాడాలని, అనుమతించిన విద్యుత్ పరిమితులనే వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఉత్సవాలను, శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పోలీస్, ఇతర శాఖల అధికారులు మండప నిర్వాహకులకు, ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మొదటి ప్రాధాన్యత

## మంత్రి వివేక్ వెంకటస్వామి



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో షేర్ విత్ విజన్ సంస్థ సహకారంతో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, స్టేషనరీ, క్రీడా పరికరాలు మంత్రి వివేక్ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ముందుగా విద్యార్థులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. మంత్రి వివేక్ జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ప్రిన్సిపాల్ ప్రేమరాణి పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలకు కలెక్టర్ కుమార్ దీపక్, మంత్రి వివేక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి వివేక్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే క్రమశిక్షణతో ఉంటూ ఉపాధ్యాయులను గౌరవిస్తూ పట్టుదలతో చదవాలని సూచించారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పాఠశాలలో పర్యటించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని లక్షల రూపాయల నిధులను కేటాయిస్తూ అధికారులను ఆదేశించడం జరిగిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులకు ఎలాంటి అవసరాలు ఉన్న రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కాకా ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ చేయడానికి ముంధుకు వచ్చిన షేర్ విత్ విజన్ సంస్థ సభ్యులను, ప్రతినిధి నారాయణను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అత్యాధునిక సౌకర్యాలతో చెన్నూరు సోమనపల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ప్రారంభించబోతున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఒడ్నాల శ్రీనివాస్, కౌన్సిలర్లు ప్రభాకర్, శ్రీనివాస్, మల్లేష్, శ్రీదేవి, తిరుమల, శిరీష, మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం కళ, మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, బత్తుల వేణు, గాండ్ల సమ్మయ్య, అబ్దుల్ అజీజ్, సీనియర్ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయురాల్లు పాల్గొన్నారు.

# కొలువుదీరిన బొజ్జ గణపయ్యలు

## గణనాధుని ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** వినాయక చవితి పర్వదినాన పట్టణ పరిధిలో ఆయా నిర్వాహకులు ఏర్పాటు చేసిన గణేష్ మండపాలలో బొజ్జ గణపయ్యలు కొలువుదీరారు. భక్తిశ్రద్దలతో, మంగళహారతిలతో, డప్పు వాయుధ్యాల నడుమ గణపతులను మండపాలలో నిర్వాహకులు ప్రతిష్టించారు. గణనాదుల దాతలు, లడ్డు దాతలు మొదటి రోజు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తొమ్మిది రోజులు బొజ్జ గణపయ్య భక్తుల నుండి విశిష్ట పూజలు అందుకోనున్నాడు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గంగాకాలని, భగత్ సింగ్ నగర్ లో కొలువుదీరిన లంభోదరుడుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురాగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎలినినో ప్రభావం రాష్ట్ర ప్రజలపై ఉండకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలనుతీసుకుంటుందన్నారు. వినాయక స్వామివారిని దర్శించుకున్న వారిలో పట్టణ పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు

# తొర్రూరు మండల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలి

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొర్రూరు, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):** తొర్రూరు మండలానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులతో పాటు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులతో పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.తొర్రూరు మండలంలోని గ్రామాల వారీగా అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఎమ్మెల్యే గారు సూచించారు. ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి పనులు ఎక్కడా ఆలస్యం కాకుండా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాప్రతినిధులు తెలిపిన సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే గారు, సంబంధిత అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.తొర్రూరు మండలాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం ఎంతో కీలకమని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులకు సూచిస్తూ, ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమీక్ష సమావేశంలో తొర్రూరు మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాలన్‌పూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనంను ప్రారంభించిన కలెక్టర్

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**మావల సెప్టెంబర్ 16 ( జనం సాక్షి):** నార్నూర్ మండలంలోని బాలన్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని స్థానిక స్థాయిలోనే పరిష్కరించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నూతన పంచాయతీ భవనాన్ని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమర్థవంతంగా వినియోగించుకోవాలని అన్నారు.ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నూతన గ్రామ పంచాయతీ భవనం అందుబాటులోకి రావడంతో ప్రజలకు పాలన మరింత చేరువ కానుందని పేర్కొన్నారు. స్థానిక సమస్యలను పంచాయతీ స్థాయిలోనే పరిష్కరించుకోవడానికి ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. గ్రామ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేస్తూ ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో పుల్లారావు, సర్పంచ్ ఆత్రం సంగీత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్రుని 25 ఏళ్ల ప్రజాసేవ ప్రస్థానం

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



**గూడూరు,సెప్టెంబర్15(జనంసాక్షి):** ఈనెల 17న,నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ గూడూరు మండల శాఖ అధ్యక్షులు రాసమల్ల వెంకటేశ్వర్లు,రాష్ట్ర నాయకులు రాంబాబు నాయక్ అన్నారు.అనంతరం గూడూరు తహసీల్దార్ నాగ భవాని కి వినతిపత్రం అందజేశారు.ఈసందర్బంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సుపరిపాలన,అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా నరేంద్ర మోదీ నాయకత్వం పని చేస్తుందని,ప్రజాసేవలో నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రస్థానం దేశ రాజకీయాల్లో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిందని,సుపరిపాలన, పారదర్శకత,అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఆయన తన పాలనా విధానాన్ని కొనసాగించారు.దేశ అభివృద్ధిని వేగవంతం చేయడం,మౌలిక వసతుల కల్పన,పేదలు,రైతులు, మహిళలు,యువత సంక్షేమానికి పలు కార్యక్రమాలను అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు."సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్" అనే నినాదంతో సమగ్ర అభివృద్ధి దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం సందర్భంగా మోదీకి జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాలపై శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు మల్లయ్య గౌడ్ గారు, జిల్లా నాయకులు పడాల నాగరాజు గారు,ప్రధాన కార్యదర్శి అనిల్,గిరిజన మోర్చా మండల అధ్యక్షులు దేవేందర్, గుండెబోయిన మల్లేష్,బాల్సుకూరి సంపత్, బూత్ అధ్యక్షులు శ్రీనివాస్,శాంతమ్మ, హరి దాసు, రమేష్,తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మండలవ్యాప్తంగా కొలువుదీరిన గణనాథుడు

## మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



**దేవరుప్పుల, సెప్టెంబర్ 15 (జనం సాక్షి)** దేవరుప్పుల మండల వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మండపాల్లో గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రుల సందర్భంగా భక్తులు భజన పాటలు పాడుతూ, మహిళలు, యువతులు కోలాటాలు ఆడుతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పుతున్నారు. చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొంటూ సందడి చేస్తున్నారు.మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని నిర్వాహకులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

# సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



**దేవరుప్పుల, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):** దేవరుప్పుల మండలంలోని రాంబోజిగూడెం, గొల్లపెల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, చిరుధాన్యాలతో సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ,గొల్లపెల్లి సర్పంచ్ తీగలపరుశరాములు×జణూ సూపర్‌వైజర్ సావిత్రి అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణీలు, బాలింతలు చిన్నారులు పాల్గొన్నారు.

# యువతకు అండగా సర్పంచ్ విక్రమ్

## రూ.42వేల విలువ గల మైక్ సెట్ బహుకరణ



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 15 ( జనం సాక్షి ):** మండలంలోని పదహారు చింతల తండ గ్రామ పంచాయతీ పరిధిలోని నక్కలగుట్ట తండ యువతకు ఇచ్చిన హామీని గ్రామ సర్పంచ్ బానోతు విక్రమ్ నెరవేర్చారు. వినాయక చవితి పండుగ సందర్భంగా యువత కోసం రూ.42 వేల విలువైన మైక్‌సెట్‌ను ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి స్ఫూర్తితో మంగళవారం బహూకరించారు .ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేశ్, గణేష్, కేశ్య, జేత్య నాయక్, కిషన్, శంకర్, శ్రీను, రాజు, బద్రు, చందు, నక్కలగుట్ట తండ యువకులు, మహిళలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రోస్టర్ పాయింట్లు సవరించాలి

## సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ



**మావల సెప్టెంబర్ 16( జనం సాక్షి):** ఉద్యోగ రిజర్వేషన్లలో మాలలకు న్యాయం జరిగేలా రోస్టర్ పాయింట్లను వెంటనే సవరించాలని మాల ఉద్యోగుల జిల్లా కన్వీనర్ కె. సత్యనారాయణ డిమాండ్ చేశారు. సమావేశంలో అల్లూరి భూమన్న, కుమ్మరి సత్యనారాయణ, శశికాంత్, బొంకటి సుభాష్, గంగన్న, మెట్టపల్లి భీమ్‌రావు, మైస విటల్, దువాస రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం తప్పదు

- రానున్న రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయం
- బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనులకు పెద్దపీట వేసిన కేసిఆర్
- చెన్నారావుపేట మాజీ జెడ్పిటిసి బానోతు పత్తి నాయక్



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 15( జనం సాక్షి) :** గిరిజనులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం తప్పదని చెన్నారావుపేట మాజీ జెడ్పిటిసి బానోతు పత్తి నాయక్ అన్నారు. మంగళవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ గిరిజన ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలం చెందాడన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని రానున్న ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ గిరిజనులకు పెద్దపీట వేశాడన్నారు. ఎస్టి రిజర్వేషన్లు 6 శాతం నుండి 10శాతంకు పెంచాడన్నారు. అలాగే ఎస్టీ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద రూ. 13,412.63 కోట్లు కేటాయించారన్నారు. అదేవిధంగా గిరిజన రైతుల బంజరు సాగుకు పనికిరాని భూములను సాగులోకి తీసుకురావడానికి గిరి వికాసం పథకాన్ని అమలు చేసి 19 వేల 698 మంది గిరిజన రైతులకు చెందిన 56 వేల 613 ఎకరాలను సాగులోకి తీసుకువచ్చారన్నారు. అలాగే గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి రోడ్లు, విద్యుత్, తాగునీరు, మౌలిక వసతుల కోసం ఎస్టి ఎస్ డి ఎఫ్ లో రూ. 1000 కోట్లు ప్రత్యేకంగా నిధులను కేటాయించి అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టీ డిక్లరేషన్లో ఓట్ల కోసం ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ను ప్రకటించి ఎస్టీలను మోసం చేసిందన్నారు. అర్హులైన గిరిజనులందరికీ పోడు భూములపై హక్కులు కల్పించి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి గిరిజనుల భూములను లాక్కొని గిరిజన మహిళలను బట్టలు చినిగేలా కొట్టించారన్నారు. మూడు కొత్త గిరిజన కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఒక్కో కార్పొరేషన్ కు సంవత్సరానికి రూ. 500 కోట్ల గ్రాంట్ ఇస్తామని హామీ ఇచ్చి తుకారం ఆదివాసి కార్పొరేషన్, సంత్ సేవాలాల్ లంబాడా కార్పొరేషన్, ఎరుకల కార్పొరేషన్ మూడు కార్పొరేషన్లు ఎక్కడ ఉన్నాయని ఒక్కొక్క కార్పొరేషన్ కు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కేటాయించారా అని ప్రశ్నించారు. ప్రతి తండా గ్రామపంచాయతీకి ప్రతి ఏడాది రూ. 25 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఏ ఒక్క తండా గ్రామ పంచాయతీకి నిధులు ఇవ్వలేదని విమర్శించారు. ప్రతి మండలంలో ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూల్ లు ఏర్పాటు చేసి ఫీజు రియంబర్స్మెంట్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా క్యాబినెట్ లో మా గిరిజన బిడ్డకు మంత్రి పదవి ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేకుంటే రానున్న రోజుల్లో గిరిజనుల సత్తా ఏంటో చూపించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల బిఆర్ఎస్ గిరిజన ముఖ్య నాయకులు గుగులోతు స్వామి నాయక్, బానోతు లాల్ సింగ్, ఆంగోతు వీరాసింగ్, తిమ్మరాయిని పహాడ్ సర్పంచ్ దారావత్ రమేష్, బాదావత్ వీరన్న నాయక్, బోడ మురళి నాయక్, భూక్య కిషన్ నాయక్, బోడ ఆనంద్, భూక్య శ్రీనివాస్, గుగులోతు లాలు, మూడు రమేష్, బోడ సంపత్, అజ్మీర బాలాజీ, బాలు, కోర్ర మోహన్, లావుడియా దేవ్ సింగ్, గుగులోతు ప్రభాకర్, గుగులోతు రాజేందర్, భూక్య రాజు, గుగులోతు కిరణ్, భూక్య గణేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# నడిరోడ్డుపై చెత్తాచెదారం పట్టించుకోని పంచాయతీ అధికారులు

- దుర్వాసనతో నరకం చూస్తున్న 4వ వార్డు ప్రజలు
- అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన
- తక్షణమే స్పందించాలని గ్రామస్థుల డిమాండ్

తాండూర్, సెప్టెంబర్ 15(జనం సాక్షి) మంచిర్యాల జిల్లా తాండూర్ మండల పరిధిలోని మాదారం గ్రామ పంచాయతీ నాలుగో వార్డులో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా లోపించింది. వార్డులోని నడిరోడ్డుపైనే గత కొన్ని రోజులుగా చెత్తాచెదారం భారీగా పేరుకుపోవడంతో స్థానిక ప్రజలు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపైనే వ్యర్థాలు వేస్తుండటం, వాటిని సకాలంలో తొలగించకపోవడంతో అటుగా వెళ్లే ప్రజలు ముక్కు మూసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డుపై పేరుకుపోయిన చెత్త కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తోందని, దీనివల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో, దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యాలపై ఆందోళన చెందుతున్నారు. ఈ తీవ్రమైన పారిశుధ్య సమస్యపై స్థానిక గ్రామ పంచాయతీ అధికారులకు, పారిశుధ్య సిబ్బందికి పలుమార్లు మొరపెట్టుకున్నప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదని నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నడిరోడ్డుపై ఇంతలా చెత్త పేరుకుపోయి ప్రజలు నరకం చూస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా మంచిర్యాల జిల్లా ఉన్నతాధికారులు, తాండూర్ మండల అధికారులు తక్షణమే



స్పందించి మాదారం గ్రామపంచాయతీలో 4వ వార్డులోని రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించి, గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# జే. రవీందర్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి వివేక్



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్15(జనంసాక్షి):** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడు జే. రవీందర్ కుటుంబాన్ని చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పరామర్శించారు. మంగళవారం మందమర్రిలోని రవీందర్ నివాసానికి వెళ్లిన మంత్రి కుటుంబ సభ్యులను కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రవీందర్ మృతితో కుటుంబ సభ్యులకు కలిగిన బాధను పంచుకున్నారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పారు. అనంతరం రవీందర్ చిత్రపటానికి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. రవీందర్ మృతి కుటుంబానికే కాకుండా ఆయనతో సన్నిహితంగా ఉన్నవారికి, స్థానిక ప్రజలకు కూడా తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రవీందర్ కుటుంబానికి అండగా ఉంటామని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### తిమ్మరాయిని పహాడ్ గ్రామ సర్పంచ్ ధారావత్ రమేష్



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 15( జనం సాక్షి ):** మండలంలోని తిమ్మరాయిన్ పహాడ్ అంగన్వాడీ మూడవ సెంటర్ లో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ ధారావత్ రమేష్ హాజరై మాట్లాడారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను నిర్వహించి, వివిధ రకాల ఆహార పదార్థాల్లో లభించే పోషక విలువలను వివరించారు. చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మెనూ ప్రకారం గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రంలో భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోత్ రవి, వార్డు సభ్యులు నాగోతు రజిత, మంద విజయ్, అంగన్వాడి టీచర్ లు అరుణ కుమారి, మేరీ రాజ్యం, ఆశ కార్యకర్త అనిత, ఆయాలు శాంతమ్మ, హస్లీ, గర్భిణీలు బాలింతలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**ఆత్మకూర్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి)** కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండలం నాగయ్యపల్లి, పెద్దాపూర్ గ్రామాలలో ఇటీవలే మృతిచెందిన మాజీ వార్డు సభ్యులు అప్పని రాజీరు, బింగి రాజయ్య, చాపర్తి సమ్మయ్య కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమావేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బొల్లోజు కుమారస్వామి, కాంతాల కేశవరెడ్డి, సాహోరే రాజేశ్వరరావు, బత్తిని వంశీ గౌడ్, రవీందర్ కార్యకర్తలు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముందస్తు జన్మదిన వేడుకలు



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 15, (జనంసాక్షి)**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముందస్తు జన్మదిన వేడుకలు మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకొని క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కోసం ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరవ శ్రీ గడ్డం వినోద్ మాట్లాడుతూ నా జన్మదినం సందర్భంగా నన్ను అభిమానించే ప్రతి ఒక్కరూ చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలు నాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం. ప్రజల ఆశీస్సులతో మరింత బాధ్యతగా పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను పురస్కరించుకొని వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల నాయకులు, పట్టణ మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి ఎమ్మెల్యే గారిచే కేక్ కటింగ్ చేపించి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, వివిధ మండలాల నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా క్యాంపు కార్యాలయం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సందడిగా మారింది. ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ క్యాంపు కార్యాలయం తరఫున ప్రత్యేక భోజన ఏర్పాట్లు చేయడంతో వేడుకలు మరింత ఉత్సాహంగా సాగాయి.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

## బీజేపీ మండల అధ్యక్షులు ఉప్పుగళ్ళ శ్రీకాంత్ రెడ్డి



**ఆత్మకూర్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):** తెలంగాణ ప్రజల చారిత్రక పోరాటాన్ని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ ఆత్మకూరు మండల అధ్యక్షులు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ భారతదేశంలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన నిజాం బాధితులు, రజాకార్ల దౌర్జన్యాలను ఎదుర్కొన్న ప్రజలు, అమరులైన వీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు డిమాండ్లను ప్రస్తావించారు: సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలి. ప్రభుత్వ భవనాలపై జాతీయ జెండాతో పాటు తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలి. హైదరాబాద్‌లో "హైదరాబాద్--తెలంగాణ విమోచన మ్యూజియం" ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లాలో "తెలంగాణ విమోచన స్మృతి కేంద్రాలు" ఏర్పాటు చేసి చరిత్రను భావితరాలకు తెలియజేయాలి. పాఠశాలలు, కళాశాలల్లో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. రజాకార్ల దౌర్జన్యాలకు గురైన కుటుంబాలను గుర్తించి, వారి త్యాగాలను భావితరాలకు తెలియజేసే కార్యక్రమాలు చేపట్టాలి. "తెలంగాణ విమోచన స్మారక చిహ్నం" ఏర్పాటు చేసి, తెలంగాణ విమోచన పోరాటానికి సంబంధించిన చారిత్రక ఆధారాలు, పుస్తకాలు, ఫోటోలు, వివరాలను భద్రపరచాలి. తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, గురిజాల శ్రీరామ్ రెడ్డి ఆర్టిఐ యాక్ట్ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రవణ్ కుమార్, ఇర్సండ్ల సదానందం, ప్రధాన కార్యదర్శి రవ్వ శివప్రసాద్, మామూనూరి శ్రీనివాస్, పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, జక్కుల మహేందర్, దినేష్, సునీల్ రెడ్డి, వీరాస్వామి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముమ్మాటికీ సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవమే

## బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి)**సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక మరుపురాని, మరుగునపరచలేని చారిత్రక ఘట్టమని, ఆ రోజు నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లోకి వచ్చిన చారిత్రక సందర్భాన్ని "తెలంగాణ విమోచన దినోత్సవం"గా గౌరవించడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత అని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు సూచనలతో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన వరంగల్ చౌరస్తా కె. కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జలగం రంజిత్ రావు, కుసుమ సతీష్, సిద్ధం నరేష్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ---హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం రెండూ ఒకటే కావని, వాటి లక్ష్యాలు, రాజకీయ నేపథ్యం, కాలపరిమితి, అంతిమ లక్ష్యాలు వేర్వేరని స్పష్టం చేశారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లోకి వచ్చింది. తెలంగాణ ప్రభుత్వ అధికారిక చరిత్ర కూడా సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం అయినట్లు నమోదు చేసింది. సెప్టెంబర్ 17ను 'విలీన దినం', 'ప్రజా పాలన దినం' అంటూ పేర్లు మార్చడం ద్వారా చరిత్రలోని అసలు భావాన్ని పలుచన చేయలేరు. పేరు మార్చినంత మాత్రాన చరిత్ర మారదు. తెలంగాణ ప్రజల రక్తంతో రాసిన చరిత్రను ఏ రాజకీయ పార్టీకి నచ్చినట్లు మార్చే హక్కు లేదు" అని వారు అన్నారు. ఓటు బ్యాంకు కోసం చరిత్రను వక్రీకరించడం మానుకోవాలి కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నాటి జాతీయవాదుల త్యాగాలను పక్కన పెట్టి సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యతను నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని వారు ఆరోపించారు. "ప్రజా పాలన పేరుతో చారిత్రక దినోత్సవాన్ని మరుగునపరచే ప్రయత్నం చేయడం ప్రజా పాలన కాదు---చరిత్రపై రాజకీయ ప్రయోగం. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, కె. మహేష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా కార్యదర్శి పొనుగోటి వెంకట్ రావు, ఐ.టి ఇంచార్జ్ ఆడెపు వెంకటేష్, మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్, బిజెపి నాయకులు బైరి మురళీకృష్ణ, కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, బైరి శ్యాంసుందర్, బండి సాంబయ్య యాదవ్, సంగని జగదీశ్వర్, అంబాల రాంగోపాల్, గోగీకర్ అనిల్, జిల్లా మోర్చా అధ్యక్షులు టెకుమట్ల రేణుక, మదాసు రాజు, కూచన క్రాంతి కుమార్, విట్ఠల్ దాసు బోరహ, మహమ్మద్ రఫీ, రేపల్లె స్వర్ణజ, కొమకుల నాగరాజు, సుంకరి రాజు పాల్గొన్నారు.

# చెన్నారావుపేటలో ఘనంగా పోషకాహార వారోత్సవాలు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 15 ( జనం సాక్షి ):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడి సెంటర్ లో పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధ, జిపిఓ విజయలక్ష్మిలు హాజరై తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట అంగన్వాడి ఫస్ట్ సెంటర్ టీచర్ బండారి విజయ, సెకండ్ సెంటర్ టీచర్ దేవమ్మ, కట్టయ్య పల్లె సెంటర్ టీచర్ ఈగ మంజుల, ఆయా బూర కేతమ్మ, బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంకుసాపూర్ గ్రామంలో మన అంగన్వాడీ మన బాధ్యత కార్యక్రమం



**టేకుమట్ల సెప్టెంబర్ 15 జనంసాక్షి** :టేకుమట్ల మండలంలోని అంకుసాపూర్ అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ మాధవి ఆధ్వర్యంలో 9వ పోషన్ మామ్ ప్రోగ్రాము ' మన అంగన్వాడి మన బాధ్యత ' అనే తీమ్ తో కండక్ట్ చేయడం జరిగింది . సర్పంచ్ కారుపాకుల సునీత వినయ్ సాగర్ మాట్లాడుతూ మీరు మీ పిల్లలు ఆరోగ్యంగా ఉండడానికిపోషకాహారం తీసుకోవాలని వివరించారు ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, అంగన్వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, ఆయా సరిత తదితరులు పాల్గొన్నారు

# మండల కేంద్రంలో నరకప్రాయంగా రోడ్లు

## బురదలో కూరుకుపోతున్న అంబులెన్స్



**సెప్టెంబర్( జనం సాక్షి )15:గోవిందరావుపేట** మేజర్ గ్రామ పంచాయతీ. మండల హెడ్‌క్వార్టర్స్‌లో రోడ్ల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. స్థానిక 4వ వార్డు పరిధిలోని గ్రంథాలయం బజారులో కనీసం మనుషులు కూడా నడవలేని విధంగా బురదమయంగా మారిన రోడ్డుపైకి తెలియక వచ్చిన 102 అత్యవసర అంబులెన్స్ వాహనం బురదలో దిగబడిపోయింది. తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులను లేదా గర్భిణీలను ఆసుపత్రికి చేర్చాల్సిన అత్యవసర వాహనమే ఇలా బురదలో చిక్కుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర మంత్రి సీతక్క సొంత నియోజకవర్గంలో,అందులోనూ మండల కేంద్రంలోనే ప్రజలు ఇలాంటి నరకయాతన అనుభవించడంపై వార్డు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేరుకే మేజర్ పంచాయతీ అని, కనీస రోడ్డు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన ఈ గ్రంథాలయం బజారు రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, శాశ్వత రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బీఎస్ఎన్ఎల్ కాపర్ వైర్ దొంగల అరెస్టు




**బెల్లంపల్లి, సెప్టెంబర్ 15, (జనంసాక్షి)** బెల్లంపల్లి రూరల్ సర్కిల్ పరిధితో పాటు వివిధ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లకు సంబంధించిన కాపర్ వైర్లను చోరీ చేస్తున్న ముఠాను పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసుల్లో మొత్తం 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, ప్రత్యేక బృందాల సమన్వయంతో నిరంతరం దర్యాప్తు చేపట్టి, సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని విశ్లేషిస్తూ నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఉప్పరి సంపత్, గొమాస అజయ్ కృష్ణ, మారినేని రాజ్‌కుమార్, గొమాస అనుకృష్ణ, దుర్గం శేఖర్, దుర్గం అంకులు, పొండి రాజ్‌కుమార్, సాంబోజు రమేష్ ఉన్నారు. అరెస్ట్ చేసిన నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ విధించారు. బీఎస్ఎన్ఎల్ కాపర్ వైర్ చోరీలకు సంబంధించి నిందితుల గత నేర చరిత్ర, గ్యాంగ్ కార్యకలాపాలు, ఇతర ప్రాంతాల్లో జరిగిన ఇలాంటి చోరీ కేసుల్లో వారి ప్రమేయం తదితర అంశాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ తెలిపారు. సంబంధిత గ్యాంగ్‌లపై గ్యాంగ్ ఫైళ్లు, సస్పెక్ట్ షీట్లు ప్రారంభించి, వారి నేర కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచడంతో పాటు, భవిష్యత్‌లో ఇలాంటి నేరాలకు పాల్పడకుండా అవసరమైన అన్ని చట్టపరమైన మరియు నిరోధక చర్యలు చేపడుతున్నామన్నారు. ఆపరేషన్‌లో ఏసీపీ సీసీఎస్ కె. రవికుమార్, సీఐ సీసీఎస్ టి. గోపీ, బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్, ఎస్సై సీసీఎస్ భాస్కర్ రావు, తల్లగురిజాల ఎస్సై రామకృష్ణ, సబ్‌డివిజన్ పోలీస్ సిబ్బంది, సీసీఎస్ ప్రత్యేక బృందం సమన్వయంతో సమర్థవంతంగా కృషి చేశారు. ప్రభుత్వ ఆస్తులు, ప్రజా ఆస్తులు, టెలికాం మౌలిక వసతుల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని, కాపర్ వైర్ చోరీలు, టెలికాం పరికరాల చోరీలు మరియు ఇతర నేరాలకు పాల్పడే వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ హెచ్చరించారు.

## బస్టాండ్ లోకి బస్సులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి




**బెల్లంపల్లి, సెప్టెంబర్ 15, (జనంసాక్షి)** బెల్లంపల్లి బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎంసిపిఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరుల మాట్లాడుతూ బెల్లంపల్లి కొత్త బస్టాండ్ లోపలికి బస్సులు రాక బెల్లంపల్లిలోని ప్రజలు విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బస్సులు రోడ్డు మీద ఆపడం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్డు దాటే మార్గంలో యాక్సిడెంట్లు అయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని అన్నారు. వర్షానికి నానుతూ ఎండకు ఎండుతూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నా అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఆసిఫాబాద్ డిపో మేనేజర్, బెల్లంపల్లి ఎమ్మెల్యే స్పందించి బస్టాండ్ లోపల నిపుణులతో పర్యవేక్షించి ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకొని బస్టాండ్ లోపటికి బస్సులు వెళ్లే విధంగా చూడాలని బెల్లంపల్లి పట్టణ ప్రజలకు, మరియు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి తోగరి రాహుల్, రాజేష్, శేఖర్ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డి కోత పరికరంను అందించిన గోక లీలావతి ట్రస్ట్ వ్యవస్థాపకులు గోక రామస్వామి




**నర్సంపేట సెప్టెంబర్ 15 ( జనం సాక్షి)**గోక లీలావతి ట్రస్ట్ వ్యవస్థాపకులు గోక రామస్వామి వారి సతీమణి గోక లీలావతి . జ్ఞాపకార్థం వారి కుమారులు గోక వినోద్ , గోక నాగరాజు . వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్,వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్, ప్రొఫెసర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్సార్ యూనివర్సిటీ వరంగల్ డాక్టర్, ,పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ . అభ్యర్థన మేరకు మిని స్టేడియం నర్సంపేటకు గడ్డి కోత పరికరంను అందించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమశీ సందర్భంగా వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్, ప్రొఫెసర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్సార్ యూనివర్సిటీ డాక్టర్,,పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నర్సంపేట ప్రాంతంలో క్రీడాకారులు మరియు క్రీడారంగా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఉద్దేశంతో స్టేడియం నర్సంపేటలో క్రీడాకారులకు వాకర్స్‌కు ఇబ్బందికరంగా ఉన్నటువంటి గడ్డిని తొలగించి స్టేడియం సౌకర్యాలను మెరుగుపరచాలని ఆలోచనతో గోక లీలావతి ట్రస్ట్ వ్యవస్థాపకులు గోకు రామస్వామి. సహాయం కోరడం జరిగిందని దానికి వారు సానుకూలంగా స్పందించి 12 వేల రూపాయలు వెచ్చించి గడ్డి కోత పరికరమును అందించారని దానికి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో స్టేడియం ఇన్చార్జి కబడ్డీ కోచ్ యాట రవికుమార్. ముదిరాజ్, సీనియర్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు గూడెపు బిక్షపతి, వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఈసాల లక్ష్మయ్య, వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆడెపు సదానందం , వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రమేష్. డేవిడ్ , వ్యాయామ విద్య ఉపాధ్యాయులు దేవేందర్ . మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

## కొలువుదీరి తొలి పూజలందుకొని ఘనంగా ప్రారంభమైన వినాయక నవరాత్రులు



**మావల సెప్టెంబర్ 16( జనం సాక్షి):** వినాయక చవితిని పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా గణనాథులు వాడవాడలా కొలువుదీరారు. భక్తిశ్రద్ధలతో అలంకరించిన మండపాల్లో విఘ్నేశ్వరుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజు భక్తుల పూజలందుకున్న లంబోదరుడిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. జిల్లా కేంద్రంలోని కుమార్పేట కాలనీలో కుమార్ జనతా గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 52 అడుగుల భారీ గణపతి విగ్రహానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్యాండ్ మేళాల నడుమ గణనాథుడిని మండపాల్లో ప్రతిష్ఠించడంతో పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. నవరాత్రుల పాటు భక్తులకు బొజ్జ గణపయ్య దర్శనమివ్వనున్నాడు.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

### సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్




విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విముక్తి పొందిన సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించడంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అణచివేత, బానిసత్వం, అస్తిత్వ పోరాటం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాల్లో ఎంతోమంది అమరులయ్యారని పేర్కొన్నారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చిన బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఓ వర్గం ఓట్ల కోసం చరిత్రను వక్రీకరిస్తున్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 17న ఉదయం ప్రతి బూత్ స్థాయిలో జాతీయ జెండాను ఆవిష్కరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ 28 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవను దీవించేలా 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా సాయంత్రం 7 గంటలకు ప్రతి ఇంటి ముందు ఆశీర్వాద దీపం వెలిగించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

### హమారా ప్రసాద్‌ని వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్




**నూగూర్ వెంకటాపురం సెప్టెంబర్ 15(జనం సాక్షి ):-** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం వెంకటాపురం మండల ఎమ్మా ర్పిఎస్ అధ్యక్షులు యాసం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షులు యాసం రమేష్ మాదిగ మాట్లాడుతూ. మత దురహంకారి ఆర్ఎస్ఎస్ భావజాలం నింపుకొని కుల మతాల మధ్య చిచ్చు పెడుతున్న హమారా ప్రసాద్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని కలిపిత నాయకుడు అని అనడం సమంజసం కాదని అన్నారు. పుస్తకాన్ని విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్న హమారా ప్రసాద్‌ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని వెంటనే అరెస్టు చేయాలి డిమాండ్ చేయడం జరిగింది.భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ దళితులకు స్వేచ్ఛ స్వాతంత్రం కరువైందని అన్నాడు . డాక్టర్ భీమ్ రామ్ అంబేద్కర్ 1950లో భారత రాజ్యాంగాన్ని రాసిన తర్వాత,భారతదేశంలో సబ్బండ వర్గాలకు సమాన హక్కులు రాజ్యాంగం ద్వారా కల్పించబడ్డాయని తెలిపారు.ఇంతటి గొప్ప మహా మేధావిని పట్టుకొని. కల్పిత నాయకుడు అంటూ ఆర్ఎస్ఎస్ భావజాలంతో విషం చిమ్ముతున్న హమారా ప్రసాద్ ని వెంటనే అరెస్టు చేయాలని ఎం ఆర్ పి ఎస్ డిమాండ్ చేశారు . లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలతో నిరసనలు ధర్నా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గుగ్గిళ్ళ నరేంద్ర మాదిగ, సీనియర్ నాయకులు యాసం మహేష్ మాదిగ,సీనియర్ నాయకులు కోకిల మల్లికార్జున్ మాదిగ,వెంకటాపురం ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి చెన్నం గౌతం మాదిగ, ఎమ్మార్పీఎస్ కార్యదర్శి చెన్నం తిరుపతి మాదిగ,ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు వెల్పుల రాజు మాదిగ,ఎమ్మార్పీఎస్ కార్యదర్శి తిప్పనపల్లి వెంకటేష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# వలసవాదులకు ప్రాధాన్యం ఇచ్చి పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారు

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ల ఆవేదన

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 15, (జనంసాక్షి)**బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీలో వలసవాదులకు ప్రాధాన్యత ఇచ్చి పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బెల్లంపల్లి పట్టణంలో బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గడ్డం వినోద్ గెలవడం కోసం అహర్నిశలు కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకుండా వలసవాదులకు ప్రాముఖ్యత ఇస్తూ కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నాడని ఆరోపించారు. ఇలా అయితే రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీకి చాలా నష్టం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే నిజమైన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలను కలుపుకొని ప్రజల కోసం పనిచేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. సీనియర్ నాయకులను, కార్యకర్తలను గుర్తించి వారికి సముచిత స్థానాలు కల్పించాలని అన్నారు. మళ్ళీ బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే ఎమ్మెల్యే అందర్నీ కలుపుకొని పనిచేయాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యేపై అధిష్ఠానంకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మునిమంద రమేష్, నయీం బాయ్, రొడ్డ శ్యామ్, ఎండి గౌస్ భాయ్, జక్కుల శ్రీధర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిప్ప మనోహర్, మాజీ కౌన్సిలర్ బొడ్డు నారాయణ, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం సతీష్, సిలివేరి సత్యనారాయణ, సూరం బానేష్, మేకల శ్రీనివాస్, మత్తమారి సత్తిబాబు, మంగమూర్తి, దాసరి సంజీవ్, మతమారి జగన్, బైరి శ్రీనివాస్, మతమారి శ్రీనివాస్, రాజబ్రహ్మం, గడ్డం అశోక్, కళ్యాణం పోషం, అజీమ్ భాయ్, ఎండి రహీం, హరీష్, పాండే, బబ్లు భాయ్, ఆర్ఎం సింగ్, ఆడియో నక్క కృష్ణ, రాజారత్నం, చిన్న జీలకర్ర వాసు, సబ్బని రాజనర్సు, టివిఎల్ చారి,జంజరాల మనోహర్, కుమ్మరి శంకర్, జూపాక లక్ష్మీనారాయణ, మల్లేష్, బాబురావు, సోగాల రవి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.





# కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 15, (జనంసాక్షి)**మందమర్రి పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ త్రిశక్తి అష్టలక్ష్మి మహంకాళి కామాఖ్య అమ్మవారిని మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి, బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు వేద పండితులు, ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి, శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, నాయకులు ముచ్చర్ల మల్లయ్య, ఉయ్యాల మల్లికా దేవి, ముత్తమళ్ళ దివ్యజ్యోతి, ప్రజాప్రతినిధులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూర్‌ను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 15, జనం సాక్షి:** 2027 జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని, చెన్నూర్ ను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ లో పుష్కర ఘాట్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, నీటిపారుదల శాఖ అధికారి విష్ణు, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ లతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ..... గోదావరి పుష్కరాలు 2027 కొరకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ఇందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చెన్నూర్ లో పుష్కరాలు, మౌలిక వసతుల అభివృద్ధి కొరకు 70 కోట్ల రూపాయలతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సుమారు 8 కోట్ల రూపాయలతో పుష్కర ఘాట్లు, స్నానపు గదులు, రహదారులు తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, పుష్కరాలకు దాదాపు 1 లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా రోడ్లు, త్రాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, పార్కింగ్ తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గోదావరి రోడ్డుతో పాటు చెన్నూర్ పట్టణంలోని రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని, అంబేద్కర్ విగ్రహం నుంచి చెన్నూర్ వరకు సుమారు 5 కోట్ల 50 లక్షల రూపాయలతో రోడ్డు విస్తరణ, లైటింగ్ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోయిన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా షాపులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, పేదలు, చిరు వ్యాపారులకు ప్రయోజనం కలిగేలా 1 కోటి 20 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద సుమారు 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి ఇంటికి నల్లా ద్వారా త్రాగునీరు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. చెన్నూర్ పెద్ద చెరువును సుమారు 17 కోట్ల రూపాయలతో చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, శివ్వారం గోదావరి మొసళ్ల మడుగు ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని, కాళేశ్వరం, ధర్మపురి, బాసర, భద్రాచలం, కోటిలింగాల, చెన్నూర్ లోని అంబ అగస్తేశ్వర ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పుష్కరాల నాటికి ఆలయాలు, పుష్కర ఘాట్లు, రోడ్లు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పత్రాలను పరిశీలిన



**నెరడిగొండ సెప్టెంబర్15(జనంసాక్షి):**మండలంలోని వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ రూపావత్ వెంకట్ రాం ఆధ్వర్యంలో మంగళవారం రోజున ఎస్ ఐ ఆర్ సవరణ ప్రక్రియలో భాగంగా పేర్లలో వ్యత్యాసాలు ఉన్న వారికి సవరణ కోసం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించిన అధికారులు గ్రామానికి చేరుకుని నోటీసులు అందుకున్న వారి డాక్యుమెంట్లను పరిశీలించారు. పేర్లు, వివరాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమకు సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచుకుని సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోపాటు. కుంటాల సర్పంచ్ ఆత్రం గంగారాం మండలం ఆర్ ఐ సాయిరాం గ్రామ పరిపాలన అధికారి రియాజ్ జూనియర్ అసిస్టెంట్ రాజారాం పోశెటి వినోద్ బి ఎల్ ఓ అంగన్వాడీ టీచర్ చంద్రకళ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# 80 ఏళ్లుగా విశ్వసనీయ బీమా సేవలు

### చీఫ్ బిజినెస్ మేనేజర్ జె. నాగేశ్వరరావు



**వరంగల్ మండలం, సెప్టెంబర్ 15 (జనం సాక్షి)**నగరంలోని ములుగు రోడ్డులో గల ఓరియంటల్ ఇన్సూరెన్స్ హనుమకొండ బ్రాంచి కార్యాలయంలో సంస్థ 80వ ఫౌండేషన్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచి చీఫ్ బిజినెస్ మేనేజర్ జె. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ఇన్సూరెన్స్ అడ్వైజర్లు పాల్గొని సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బ్రాంచి చీఫ్ బిజినెస్ మేనేజర్ జె. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాలుగా పాలసీదారుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ మెరుగైన సేవలను అందిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సంస్థపై పాలసీదారులు ఉంచిన విశ్వాసమే తమకు ప్రధాన బలమని పేర్కొన్నారు. ప్రస్తుతం బీమా రంగంలో అనేక ప్రైవేట్ సంస్థలు తీవ్ర పోటీ ఇస్తున్న నేపథ్యంలో ఓరియంటల్ ఇన్సూరెన్స్ కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ పాలసీదారులకు మెరుగైనసేవలనుఅందుబాటులోకితీసుకొస్తోందన్నారు. ముఖ్యంగా క్లెయిమ్స్ సేవల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పాలసీదారులకు అండగా నిలుస్తున్నామని నాగేశ్వరరావు పేర్కొన్నారు. అర్హత కలిగిన క్లెయిమ్‌ను సకాలంలో పరిష్కరించడంతో పాటు ఆరోగ్య బీమా పాలసీదారులకు క్యాష్‌లెస్ సేవలు అందించేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. అనంతరం బ్రాంచి డిప్యూటీ మేనేజర్ సంతోష్ భార్గవ్ మాట్లాడుతూ 80 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో సంస్థ ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ పాలసీదారుల విశ్వాసాన్ని చూరగొందని, భవిష్యత్తులోనూ అదే నిబద్ధతతో సేవలను కొనసాగిస్తామని తెలిపారు. కష్టమర్ల అవసరాలు, మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొత్త సేవలను అందుబాటులోకి తీసుకువస్తూ సంస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్(అడ్మినిస్ట్రేషన్) శ్రీనివాస్, జి. సత్యనారాయణ, కె. భద్రి ప్రసాద్, పి. మదన్, బి. వెంకటేశ్వర్లు, ఆవునూరి కుమారస్వామి, ప్రదీప్, కావ్య తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో వినాయక చవితి



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 15, (జనంసాక్షి)**బెల్లంపల్లి నియోజకవర్గంలో సోమవారం వినాయక చవితి పండగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గణేష్ మండపాలను అందంగా ముస్తాబు చేసి మేళా తాళలతో, బాజా భజంత్రిలతో, భజనలతో వినాయకున్ని మండపాలలో ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ దావా స్వాతి రమేష్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్, సీనియర్ నాయకులు ముచ్చర్ల మల్లయ్య, చిలుముల శంకర్, ఇతర ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, క్యాంపు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపు ప్రక్రియ పకడ్బందీగా ఉండాలి

### పౌర సరఫరాల,సహకార అధికారులు కాంట్రాక్టర్లతో అదనపు కలెక్టర్ సమీక్ష



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :**ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియ పకడ్బందీగా ఉండేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి పౌర సరఫరాలు, సహకార శాఖల అధికారులు, ధాన్యం కొనుగోలు కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్లో ఖరీఫ్ సీజన్కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన దాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియపై జిల్లా పౌర సరఫరాల శాఖ, ధాన్యం కాంట్రాక్టర్లతో సమావేశాన్ని అదనపు కలెక్టర్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తరలించే వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ను ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం తరలింపులో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. స్టోరేజ్ పాయింట్లలో ధాన్యం నిల్వ అవసరాలకు ఉపయోగపడే స్థలాలను సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. సీజన్ లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల డ్రైవర్ల సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపయోగంలో లేని ఫంక్షన్ హాళ్లు, సినిమా హాళ్ళను స్టోరేజ్ పాయింట్లుగా వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మహేందర్, జిల్లా సహకార అధికారి మోహన్, సివిల్ సప్లై డీటీలు భద్రు నాయక్, నాగేంద్ర ప్రసాద్, భాస్కర్ రెడ్డి, ధాన్యం కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# జాతీయ సహజ వ్యవసాయంపై రైతులకు శిక్షణ



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 15, (జనంసాక్షి)** బెల్లంపల్లి మండలం కన్నాల రైతువేదికలో మంగళవారం జాతీయ సహజ వ్యవసాయంపై రైతులకు శిక్షణ, అవగాహనా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం 2026 -2027 సంవత్సరానికి సంబంధించి ఎంపిక కాబడిన సేంద్రియ రైతులకు కన్నాల రైతు వేదిక వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సహజ వ్యవసాయంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించి సేంద్రియ సాగులో చేపట్టవలసిన సస్య రక్షణ చర్యలు, నీటి యాజమాన్యం, సేంద్రియ ఎరువుల యాజమాన్యం, సహజ వనరుల వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజా నరేందర్ మాట్లాడుతూ రైతులు సేంద్రియ సాగు, సహజ వ్యవసాయం చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ తక్కువ పెట్టుబడి పెడుతూ సహజసిద్ధంగా ప్రకృతిలో దొరికేటువంటి వివిధ వనరును వాడుకుంటూ రసాయనిక ఎరువులను, రసాయనిక పురుగు మందులను వాడకుండా ఉంటూ వ్యవసాయం చేసి సుస్థిర లాభాన్ని గణనీయంగా పొందవచ్చన్నారు. అనంతరం బెల్లంపల్లి మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల శ్రేయస్సు కోసం చక్కటి పథకాన్ని తీసుకు వచ్చాయని, గత సీజన్ నుండి బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో ప్రతి శుక్రవారం రైతులకు ప్రకృతి వ్యవసాయం పైన శిక్షణ, అవగాహన కార్యక్రమాలను గ్రామస్థాయిలో నిర్వహిస్తున్నామని రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహజ వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయం చేసి భావితరాలకు ఆరోగ్యం కరమైన పంటనే కాకుండా ఆరోగ్యకరమైన నేలను అందించాలని కోరారు. అనంతరం తాండూరు మండల వ్యవసాయ అధికారి సుష్మ మాట్లాడుతూ సహజ వ్యవసాయంలో ఘనజీవామృతం, అగ్ని అస్త్రం, వివిధ కషాయాలు తయారు చేసుకునే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి సిహెచ్ తిరుపతి, గురజాల వ్యవసాయ విస్తరణ అధికారి గౌసియాబేగం, కిష్టంపేట వ్యవసాయ విస్తరణ అధికారి కె రాకేష్, ఉద్యానవన అధికారిని అర్చన, అంకుశం సర్పంచ్, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి రైతులు, తాండూర్ మండలం గోపాల్ నగర్ రైతులు పాల్గొన్నారు.

# చలివాగు ప్రాజెక్టు లో తగ్గుతున్న నీటిమట్టం ఆందోళన చెందుతున్న రైతులు

- ఎమ్మెల్యే పలుమార్లు చెప్పిన పట్టించుకోని పంప్ హౌస్ అధికారులు
- జోగంపల్లి సర్పంచ్ మారబోయిన ప్రభాకర్



**శాయంపేట, సెప్టెంబర్ 15( జనం సాక్షి)** మండలంలోని జోగంపల్లి చలివాగు ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకూ తగ్గిపోతుండటంపై స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో కనీసం 17 అడుగుల నీటిమట్టం కొనసాగించాల్సి ఉన్నప్పటికీ, పంప్హౌస్ అధికారులు మోటార్లను నడుపుతూ నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని సర్పంచ్ మారబోయిన ప్రభాకర్ ఆరోపించారు. మంగళవారం రైతులతో కలిసి చలివాగు ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులో 17 అడుగుల నీటిని నిల్వ ఉంచిన అనంతరం అదనంగా వచ్చే నీటిని మాత్రమే ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుందని అన్నారు. కానీ ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయి బొందలు తేలే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ఆదేశాల మేరకు పలుమార్లు పంప్హౌస్ను బంద్ చేయించినప్పటికీ, అధికారులు మళ్లీ మోటార్లు నడుపుతూ నీటిని తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సూచనలు చేసినప్పటికీ ఆయన మాట లెక్కచేయకుండా సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నారని అన్నారు.చలివాగు ప్రాజెక్టు నీటిపై ఆధారపడే రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే నీటి తరలింపును నియంత్రించాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో తప్పనిసరిగా 17 అడుగుల నీటిమట్టాన్ని కొనసాగించి, అదనపు నీటిని మాత్రమే ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరారు.రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు లక్కం రాంబాబు, కవటం ప్రభాకర్, నరసయ్య, కర్ణాకర్, స్వర్గం ప్రభాకర్, రవి, సదానందం, బిక్షపతి నరేష్,వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక చవితి వేడుకలు



**గోవిందరావుపేట సెప్టెంబర్ 15:(జనం సాక్షి)** మండలంలో వినాయక చవితి వేడుకలను మండల ప్రజానీకం సోమ మంగళవారాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 80కి పైగా మండపాలలో గణేష్ విగ్రహాలను నెలకొల్పినట్లు స్థానిక ఎస్ఐ తాజుద్దీన్ మంగళవారం పాత్రికేయులకు విడుదల చేశారు. మరో ఎనిమిది రోజులపాటు ఈ గణేష్ నవరాత్రి ఉత్సవాలు మండలంలో దిగ్విజయంగా కొనసాగనున్నాయి. ఆయా గ్రామాల్లో ఇప్పటికే సాంస్కృతిక కార్యక్రమాలను , అన్నదాన కార్యక్రమాలను నిర్వహించేందుకు మండప నిర్వహణ కమిటీ లు సన్నాహాలు చేసుకుంటున్నారు. కాగా మండలంలోని అన్ని వినాయక మండపాలకు ఇప్పటికే జియో టాకింగ్ చేయడం జరిగిందని రాత్రింబవళ్లు పోలీసులు పర్యవేక్షణలో ఉంటాయని ఇతరులకు మండపాల ద్వారా సౌండ్ సిస్టం ద్వారా ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ తాజుద్దీన్ తెలిపారు. మతసామరస్యంగా ఈ ఫెస్టివల్ను జరుపుకోవాలని సూచించారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు అయ్యవారిల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ తీర్థప్రసాదాలను భక్తులకు పంచుతున్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి


### జిల్లా కలెక్టర్కు మెమొరండం అందజేసిన బిజెపి నేతలు



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :**సెప్టెంబర్ 17న "తెలంగాణ విమోచన దినోత్సవం" అధికారికంగా జరిపించినప్పుడే ప్రాణాలర్పించిన వీర అమరవీరులకు నిజమైన శ్రద్ధాంజలి ఘటించినట్లు అవుతుందని బిజెపి నేతలు అన్నారు మంగళవారం బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నేతలు, కలెక్టర్ చాహత్ బాజ్పాయ్కి మెమొరాండం సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నాయకులతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్. పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వీర చరిత్రను భావితరాలకు అందించాలనే బాధ్యతతో 1998 నుండి బీజేపీ నిరంతరం పోరాడుతోంది. ఉద్యమ సమయంలో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్ చేసిన నాయకులు, అధికారంలోకి వచ్చాక ఎందుకు విస్మరించారో సమాధానం చెప్పాలి. అని అన్నారు అమరుల త్యాగాలను గౌరవిస్తూ సెప్టెంబర్ 17ను వెంటనే ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. మహాత్ముల పోరాటాల గడ్డపై స్వేచ్ఛా వాయువులు వీచిన ఈ చారిత్రాత్మక రోజును సముచితంగా జరుపుకోవాల్సిందే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి బిజెపి నేతలు కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్‌లో సీటు సాధించిన గీతిక

### అభినందించిన తల్లిదండ్రులు, గ్రామస్తులు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 15( జనం సాక్షి) :** ఎంబిబిఎస్‌లో కుసుమ గీతిక సీటు సాధించింది. చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన కుసుమ నరేందర్ - కళ్యాణి దంపతుల కూతురు గీతిక జూలై నెలలో నిర్వహించిన నీట్ పరీక్షను రాసింది. ప్రభుత్వం వెలువరించిన నీట్ ఫలితాలలో 168372 ర్యాంకును సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. గీతిక నిరుపేద కుటుంబంలో పుట్టి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో తల్లిదండ్రులు నరేందర్-కళ్యాణి, గ్రామస్తులు తదితరులు ఆమెను అభినందించారు.

# బాల్య వివాహాల నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** జిల్లాలో బాల్యవివాహాల నివారణకు, లైంగిక నేరాల నుండి బాలలను రక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పోలీస్, రెవెన్యూ, శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, విద్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య కార్యక్రమం క్రింద బాల్య వివాహాల నిషేధిత చట్టం, పోక్సో చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. బాల్య వివాహాల నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించాలని, బాల్య వివాహాల వలన భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలపై తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. కిశోర బాలికల సాధికారతను సమర్థవంతంగా పర్యవేక్షించాలని, పాఠశాలలు, కళాశాలలో బాల్యవివాహాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. లైంగిక నేరాల నుండి బాలల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లైంగిక వేధింపులు లైంగిక దాడి, అశ్లీల చిత్రాల కోసం పిల్లలను ఉపయోగించే వారిని గుర్తించి పోక్సో చట్టం క్రింద కఠినంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేయాలని, సర్పంచ్ లు, స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములు చేయాలని తెలిపారు. అనంతరం మన అంగన్వాడి – మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా పోషణ మాసం పై అధికారులతో సమీక్షించారు. ఈ నెల 9వ తేదీ నుండి వచ్చే నెల 8వ తేదీ వరకు జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాలలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, 3 సంవత్సరాల లోపు వయసు కలిగిన పిల్లలు అందరూ అంగన్వాడీ లలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుబంధ పోషకాహారాలైన పప్పు, ఆకుకూరలు, చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా పోషణ మాసం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, డి సి పి ఓ మహేష్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి రాందాస్, సి డి పి ఓ లు, సఖి – బాలల రక్షణ సిబ్బంది, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత పై అవగాహన

### అంగన్వాడీ సూపర్వైజర్ జ్యోతి



**మంచిర్యాల, సెప్టెంబర్ 15, జనంసాక్షి:** పిల్లల ఆరోగ్యం, శారీరక ఎదుగుదల , రక్షణ కోసం పరిశుభ్రతను పాటించడం చాలా ముఖ్యం అని అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి, టీచర్ భూదేవి పేర్కొన్నారు .మంగళవారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల 2 అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాస కార్యక్రమం లో భాగంగా తల్లులకు, సంరక్షకులకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... 5 సంవత్సరాల లోపు పిల్లలకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు.పిల్లలు ఆహారం తినే ముందు, తిన్న తర్వాత చేతులు కడుక్కునేలా అలవాటు చేయాలని తెలిపారు . పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి పంపించేలా ప్రోత్సహించాలని కోరారు . ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీ లక్ష్మీ ,గర్భిణీలు తల్లులు,పిల్లలు, పాల్గొన్నారు

# వ్యవసాయ భూమిలో అంతర పంటగా గంజాయి సాగు

### ఇద్దరు నిందితుల అరెస్ట్

### 1245గంజాయి మొక్కలు,11 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్పీ ఆదేశాల మేరకు, విశ్వసనీయ సమాచారం ప్రకారం గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ పత్రిక ప్రకటనలో తెలియపరచారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్లో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 1,245 గంజాయి మొక్కలు మరియు 11 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ డి.ఎస్.పి అశోక్ ఆధ్వర్యంలో సిఐ రమేష్,ఎస్ఐ రవి తనిఖీలు చేపట్టారు. తేదీ:13.09.2026న జైనూర్ ఎస్ఐ జి. రవికుమార్‌కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పట్నాపూర్ మెయిన్ రోడ్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన అంబురే పుండలిక్, తండ్రి :సీతారాం, వయస్సు 50 సంవత్సరాలును తనిఖీ చేయగా, అతని వద్ద ఉన్న టవల్‌లో దాచిన 11 గ్రాముల ఎండు గంజాయి గుర్తించారు. ప్రభుత్వ పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో అంబురె పుండలిక్ తన కుమారుడుతో ,కలిసి తమ వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను అక్రమంగా సాగు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం లభించింది. దీంతో పోలీసులు వ్యవసాయ విస్తరణ అధికారి (ఎ ఈ ఓ ), ప్రభుత్వ పంచ సాక్షుల సమక్షంలో వ్యవసాయ భూమిని తనిఖీ చేయగా,అక్కడ పెద్ద సంఖ్యలో గంజాయి మొక్కలు గుర్తించారు. మొత్తం 1,245 గంజాయి మొక్కలను వేర్లతో సహా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ. ఒక కోటి 50లక్షలు.(1.50కోట్లు)/–గా అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు నిందితుల వివరాలు 1)అంబురే పుండలిక్ 2) అంబురే రమేష్‌లను 14.09.2026న అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. గంజాయి,ఇతర మాదకద్రవ్యాల అక్రమ సాగు,రవాణా మరియు విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు. గంజాయి సాగు చేసే వారిపై నిఘా వేసి,అప్రమత్తంగా ఉండి అదుపులోకి తీసుకున్నందుకు జైనూర్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ నితికా పంత్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డి.ఎస్పి. అశోక్,జైనూర్ సిఐ రమేష్, ఎస్ఐ రవి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరు పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

### పాతమగ్దంపురం గ్రామ సర్పంచ్ ననుమాస కరుణాకర్



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 15 ( జనం సాక్షి):** నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని పాత మగ్దంపురం గ్రామ సర్పంచ్ ననుమాస కరుణాకర్ అన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో పాత మగ్దంపురం గ్రామానికి చెందిన కట్టూరి లక్ష్మణాచారికి రూ.19 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయ్యాయి. ఆ చెక్కును బాధితుడికి మంగళవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్వాల శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ ననుమాస వీరస్వామి, వార్డు సభ్యులు నాంపల్లి సంపత్, నాయకులు బొత్త, పాషా, యూత్ అధ్యక్షులు గద్దల ప్రశాంత్, పరికినవీన్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిని కలిసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

### జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్



**మల్హర్, సెప్టెంబర్ 15( జనం సాక్షి)** హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో మలహర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగిడి శ్రీనివాస్, మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కం అశోక్, మహా ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి రాజయ్య, కాటారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా మండలాల్లో నెలకొన్న పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, సంక్షేమ పథకాల అమలు, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు పార్టీ సంస్థాగత బలోపేతానికి సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.మంత్రి శ్రీధర్ బాబు తమ విజ్ఞప్తులను సానుకూలంగా స్వీకరించి, సమస్యల పరిష్కారంపై హామీ ఇవ్వడం పట్ల నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# వేధింపులు ఎదురైతే భయపడొద్దు షీ టీంను ఆశ్రయించండి



**సిర్పూర్ టి, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై మంగళవారం ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగజ్ నగర్ షీ టీం ఇన్చార్జి ఏఎస్ఐ సునీత మాట్లాడుతూ, విద్యార్థినులు, చిన్నతనం నుండే సమాజంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై ప్రాథమిక అవగాహన కల్పించారు. అనంతరం, ఆమె మాట్లాడుతూ, మహిళల భద్రతకు ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలు, ఆపద సమయాల్లో తక్షణమే స్పందించే విధానాలపై వివరించారు. ముఖ్యంగా, ప్రస్తుత డిజిటల్ యుగంలో, సోషల్ మీడియా, వాడకంలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుర్తుచేశారు. ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి నేరాల బారిన పడకుండా ఎలా రక్షణ పొందాలో అవగాహన కల్పించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే భయపడకుండా డయల్ 100, లేదా 112, సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఎవరైనా వేధింపులు లేదా సమస్యలకు గురైతే తక్షణమే కాగజ్ నగర్ షీ టీం, మొబైల్ నంబర్, 8712670565 కు, సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి, వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని, ఆమె హామీ ఇచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, ఉపాధ్యాయ బృందం, షీ టీం సభ్యులు రమాదేవి, శ్రీనివాస్ మరియు పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ రవి



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :**ప్రత్యేక సమగ్ర సవరణప్రక్రియలో భాగంగా హనుమకొండ న్యూరాయపురలోని 78వ పోలింగ్ కేంద్రంలో నో మ్యాపింగ్, అనామాలీస్ జాబితాలోని ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన విచారణ కేంద్రంలో కొనసాగుతున్న విచారణ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అనామాలీస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలు, నోటీసుల జారీ, ఇప్పటి వరకూ ఎంతమంది ఓటర్లు ధ్రువ పత్రాలు సమర్పించారు, ఎన్ని విచారణ చేశారు, ఇంకా ఎన్ని చేయాల్సి ఉందనే వివరాలను ఏఈఆర్వోలు, బీఎల్వోలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జాబితాలోని ఓటర్లు సమర్పించిన ధ్రువ పత్రాల విచారణ ప్రక్రియను పరిశీలించారు. విచారణ ప్రక్రియకు హాజరైన ఓటర్లతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. అనంతరం అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనామాలీస్ జాబితాలో ఉన్న ఓటర్ల ధ్రువ పత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జాబితాలో ఉన్న ఓటర్లు సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తుది ఓటర్ల జాబితాలో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ ఏఈఆర్వో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఏఈఆర్వో నాగరాజు, బీఎల్వో సూపర్వైజర్ కవిత, బీఎల్వోలు పాల్గొన్నారు.

# జిలకర విజయ పార్థివ దేహాన్ని సందర్శించి

## వారి కుటుంబసభ్యులను పరామర్శించిన దావేర అనిల్ కుమార్



**దేవరుప్పుల, సెప్టెంబర్ 15 (జనం సాక్షి)** కామారెడ్డిగూడెం గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు జిలకర కిషన్ భార్య జిలకర విజయ అనారోగ్యంతో మృతి చెందగా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దావేర అనిల్ కుమార్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు కార్యక్రమంలో కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు కృష్ణ, ఇనుముల నాగరాజు, కాడబోయిన గణేష్, భూక్య సజ్జన్, మహమ్మద్ జాకీర్, గోపు సుధాకర్ రెడ్డి, బానోత్ రామచంద్రు, రెడ్డి రాజుల రమేష్, ఉప్పుల ఉప్పులయ్య, దౌపాటి నరసయ్య, గూగులోతు నరేందర్, ఓడపల్లి పుల్లయ్య, పులి పంపుల భాస్కర్, కొంగరీ ఉమేష్, గనుపాక ప్రదీప్, పులిగిల్ల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడే మన సంస్కృతి, పర్యావరణానికి రక్షణ

## ములుగులో లయన్స్ క్లబ్ పిలుపు




**ములుగు ప్రతినిధి,సెప్టెంబర్ 15(జనంసాక్షి).** పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ములుగు లయన్స్ క్లబ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని రసాయన రంగులు కలిగిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల జలవనరులు కలుషితం అవుతున్న నేపథ్యంలో, ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 200 మట్టి వినాయక విగ్రహాలను ములుగు జిల్లా కేంద్రంలోని ప్రజలకు మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ... మట్టి వినాయకుడే మన సంస్కృతి, మన పర్యావరణానికి రక్షణ. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటిలో కరగక చెరువులు, కుంటలు కలుషితం అవుతున్నాయి. మట్టితో చేసిన విగ్రహాలు సులభంగా నీటిలో కరిగిపోయి జలవనరులను కాపాడతాయి. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరుతున్నాం. ఇది కేవలం పండుగ మాత్రమే కాదు, భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించే బాధ్యత" అని పిలుపునిచ్చారు. పర్యావరణహితంగా పండుగను జరుపుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, లయన్ కొండి సాంబశివ జోన్ చైర్ పర్సన్, లయన్ ఆడెపు రాజు సెక్రటరీ, లయన్ చుంచు రమేష్, లయన్ దొంతి రెడ్డి బలరాం రెడ్డి, లయన్ సోమ నరసయ్య, లయన్ వెంకట్ రెడ్డి లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రపంచ వెదురు దినోత్సవాన్ని విజయవంతం చేయండి



**ఖానాపూర్ సెప్టెంబర్ 15 (జనం సాక్షి)** ఈ నెల 18న రాజధానిలోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేదరి (మహేంద్ర) సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సిలివేరి లక్ష్మీ నర్సయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని విజయవంతం చేయడమే మన విజయమని, రాబోయే రోజులలో మనకు రావలసిన వివిధ పథకాలను ప్రభుత్వం నుండి అందిపుచ్చుకోవాలంటే మనం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి మన ఉనికిని చాటుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారికంగా ప్రపంచ వెదురు దినోత్సవాన్ని నిర్వహించడం మేదరిల (మహేంద్రుల) సంప్రదాయ వృత్తికి లభిస్తున్న గౌరవంగా భావించాలని వివరించారు. మేదరుల (మహేంద్రుల) సంఖ్య, ఐక్యతను చాటడంతో పాటు సంప్రదాయ వెదురు వృత్తి గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయాలని, రాబోయే తరాల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేందుకు అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని లోకల్ బస్సులు : ఆర్టీసీ ఆర్ఎం



**హనుమకొండ, సెప్టెంబర్ 16 :(జనం సాక్షి ):** ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని వరంగల్ కాజీపేట మధ్య అదనంగా లోకల్ బస్సులు హనుమకొండ బస్టాండ్ మీదుగా నడపనున్నట్లు వరంగల్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోమరాజు భవాని ప్రసాద్ తెలిపారు. 1దీ పేరుతో ప్రతిరోజు 46 ట్రిప్పులను తిప్పడం జరుగుతుందని ఆయన వివరించారు. వరంగల్ నుండి హనుమకొండ చౌరస్తా, హనుమకొండ బస్టాండ్, కాళోజీ కళాక్షేత్రం, బాలసముద్రం, అదాలత్ మీదుగా కాజీపేటకు పోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కాజీపేట నుండి అదాలత్, బాలసముద్రం, కాళోజీ కళాక్షేత్రం, అశోక జంక్షన్ ,హనుమకొండ చౌరస్తా మీదుగా వరంగల్ కు ఈ బస్సులు నడపడం జరుగుతుందని తెలిపారు.ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మరిన్ని ట్రిప్పులు పెంచడానికి కూడా ప్రయత్నిస్తామన్నారు. గతంలో తిరుగుతున్నట్లుగానే మరికొన్ని లోకల్ బస్సులు పెట్రోల్ పంపు, పబ్లిక్ గార్డెన్ ద్వారా కూడా నడుస్తాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు ఉపయోగించుకొని ఆర్టీసీని మరింతగా ఆదరించాలని ఆర్ఎం కోరారు.

# జన్నారం మండల కేంద్రంలోని

# ప్రెస్ భవన్ ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు

## గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



**జన్నారం, సెప్టెంబర్ 15, జనంసాక్షి:** జన్నారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆదివాసీ, గిరిజన నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ఎంతో కృషి చేశారని అన్నారు. తండాలు, గూడాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. అలాగే గిరిజనుల రిజర్వేషన్‌ను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కూడా కేసీఆర్‌దేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయలేదని ఆరోపించారు. గిరిజనుల హక్కులను కాపాడడంతో పాటు ఇచ్చిన హామీ మేరకు 12 శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# దామెర రోడ్డును పునరుద్ధరణ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ఎల్క్ తుర్తి సెప్టెంబర్ 16 :(జనం సాక్షి )** ఎల్కతుర్తి మండల కేంద్రములో ఉన్న స్థానిక ఎస్బిఐ సమీపములోఉన్న రోడ్డు పై నీటినిలువలు ఉండడం వలన కొందరు రాజకీయనాయకులు నాట్లు వేస్తూ వినూత్న పద్ధతిని ప్రదర్శించగా స్పందించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి పాల్గొని రోడ్లను పునరుదన చేశారు.. బురద మాయం పై ఉన్న రోడ్లను. మోరం కంకర పోసి చదును చేసేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రోడ్లకు మధ్య పోజులు ఇవ్వడం సర్వ సాదారణము అయిన విషయన్ని గుర్తు చేశారు ఈ సంబంర్భంగా సొసైటీ చైర్మెన్ ఇంద్రసేనారెడ్డి స్పందించి మాట్లాడారు వారు మాట్లాడుతూ కాజీపేట దామెర నుండి హన్మకొండ నుండి వచ్చిపోయే ప్రయాణికులు అలాగే ఆటోలు బైకులు ఇతర వాహన దారులకు దారులు సరిగా లేక పోవడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న. విషయాన్ని గుర్తుచేస్తూ రోడ్డును చదువులు చేస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ తో పాటు సూసైటి బ్యాంక్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి మాజీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పు మహేందర్ బాపిడ్ సర్పంచ్ రవీందర్ గౌడ్ శ్రీకాంత్ దామెర గ్రామ శాఖ వైస్ ప్రెసిడెంట్ కదారి సుధీర్ నాయకులు జడ్సన్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కొయ్య బొమ్మలకు కొత్త ఊపిరి

## పొనికి చెట్ల పెంపకానికి ప్రోత్సాహం :జిల్లా కలెక్టర్



**నిర్మల్ బ్యూరో , సెప్టెంబర్ 15: (జనంసాక్షి )** నిర్మల్ కొయ్యబొమ్మల కళను పరిరక్షిస్తూ కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. మంగళవారం పట్టణంలోని కొయ్యబొమ్మల ప్రాంగణాన్ని పరిశీలించి, బొమ్మల తయారీ, మార్కెటింగ్, పొనికి కర్ర లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు. నిర్మల్ కొయ్యబొమ్మలకు దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని, తరతరాలుగా వస్తున్న ఈ కళను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బొమ్మల తయారీకి అవసరమైన పొనికి చెట్ల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలను కొయ్యబొమ్మల మార్కెటింగ్‌కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాసరలో ప్రదర్శన, విక్రయాల కోసం ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కళాకారులకు మరిన్ని మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహసీల్దార్ రాజు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల నూతన అధ్యక్షునిగా కృష్ణ ఏకగ్రీవ ఎన్నిక




**మంచిర్యాల ప్రతినిధి ,సెప్టెంబర్ 15 ,జనంసాక్షి** మంచిర్యాల మండల రేషన్ డీలర్ల యూనియన్ అధ్యక్షునిగా సుదమల్ల కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు . మంగళవారం రోజున మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంచిర్యాల మండల డీలర్ల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు . మండల డీలర్ల అసోసియేషన్ ఎన్నిక కోసం ఏర్పాటు చేయగా డీలర్లందరూ కృష్ణను అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు డీలర్లు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం ఆహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వం రేషన్ డీలర్ల కమిషన్ పెంచాలని కోరారు. గోదాముల నుండి డీలర్లకు సకాలంలో బియ్యం తూకం వేసి పంపించాలని అన్నారు . డీలర్ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసిమెలిసి ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకొనుటకు సహకరించాలని కోరారు .ఈ సమావేశంలో మంచిర్యాల మండల డీలర్లు పాల్గొన్నారు.

## మైలారంలో ఉచిత వైద్య శిబిరం




**నెన్నెల, సెప్టెంబర్ 15 (జనం సాక్షి )** మైలారం, నెన్నెల మండలంలోని మైలారం గ్రామపంచాయతీలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ డాక్టర్స్ సెల్--మెడికల్ అండ్ హెల్త్ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన వైద్యం పొందాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, డాక్టర్ చందాన సుధాకర్, ఆర్గనైజర్ పి. మహేష్, గ్రామ ప్రజలు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగ తగిలి లారీ క్లీనర్ మృతి నిందితుడిపై కేసు నమోదు



**నెరడిగొండసెప్టెంబర్ 15: (జనంసాక్షి ):** పంట రక్షణ పేరుతో ప్రమాదకర అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే హత్య నేరంతో సమానమైన కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ సి హెచ్ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం రాయ్‌పూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ నేరడిగొండ మండలం కుప్టి వద్ద మరమ్మతుల్లో ఉన్న బ్రిడ్జిని గమనించకుండా అతివేగంగా వెళ్లి అక్కడ ఉన్న ట్యాంకర్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో బ్రిడ్జి మరమ్మతులు చేస్తున్న పలువురు కార్మికులు అక్కడ నిద్రిస్తుండగా, వారి నిద్రిస్తున్న బట్టలపై నుంచి లారీ వెళ్లింది. అయితే లారీ అతివేగంగా వస్తున్న విషయాన్ని గమనించిన కార్మికులు(ఒకరికి స్వల్ప గాయం) తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రమాదంలో మనుషులు మరణించి ఉంటారనే భయంతో లారీ డ్రైవర్ అవదేశ్, క్లీనర్ రూపేష్ లారీని వదిలి పరారయ్యారు. ఈ క్రమంలో మండలంలోని గాంధారి గ్రామ శివారులో ఆత్రం చంద్రబాన్ కౌలుకు తీసుకున్న మొక్క జొన్న పంటకు రక్షణగా అక్రమంగా ఏర్పాటు చేసిన ప్రమాదకర విద్యుత్ తీగను తగిలి లారీ క్లీనర్ రూపేష్ కుమార్ (21)బీహార్, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, పంటలకు రక్షణ పేరుతో అక్రమంగా ప్రమాదకర విద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన ఆత్రం చంద్రబాన్‌పై హత్య నేరంతో సమానమైన కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్ రమేష్ తెలిపారు. పంటలకు రక్షణగా జంతువులు రాకుండా ఏర్పాటు చేసే అక్రమ విద్యుత్ తీగల వల్ల మనుషులు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సీఐ సూచించారు. జిల్లాలో ఇప్పటికే ఇలాంటి ప్రమాదకర విద్యుత్ తీగల కారణంగా ప్రాణనష్టం జరిగిన ఘటనలు నమోదయాయని తెలిపారు. ప్రాణం కంటే పంట ఎక్కువ కాదు అని స్పష్టం చేశారు. ఎవరూ తమ పొలాలకు రక్షణ పేరుతో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయవద్దనిహెచ్చరించారు. అదేవిధంగా లారీ ప్రమాదం చేసిన లారీ డ్రైవర్ అవుతేష్ కుమార్ యాదవ్ (21) లారీ డ్రైవర్, పై సైతం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

### ముస్లిం మత పెద్దలతో ఎస్పీ జానకి షర్మిల సమావేశం



**నిర్మల్ బ్యూరో , సెప్టెంబర్ 15:( జనంసాక్షి )** జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, కోరారు. మంగళవారం ముస్లిం మత పెద్దలతో ఆమె సమావేశమై ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో ప్రజల మధ్య కొనసాగుతున్న సోదరభావం, పరస్పర సహకారం, సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గణేష్ ఉత్సవాలు, శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా మతాలకు అతీతంగా అందరూ పరస్పరం సహకరించుకుంటూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. పోలీసుశాఖ ఉత్సవాల సందర్భంగా అవసరమైన అన్ని భద్రతా ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. ముస్లిం మత పెద్దలు తమ చిన్ననాటి అనుభవాలను ఎస్పీతో పంచుకున్నారు. గతంలో గణేష్ ఉత్సవాల్లో హిందూ సోదరులతో కలిసి పాల్గొన్న సందర్భాలను గుర్తు చేసుకున్నారు. నిర్మల్‌లో తరతరాలుగా కొనసాగుతున్న స్నేహభావం, సోదరభావం భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆకాంక్షించారు. నిమజ్జనం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, ఎదురయ్యే సమస్యలు, తమ సూచనలను మత పెద్దలు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వారి సూచనలను సానుకూలంగా విన్న ఎస్పీ.. ఏ సమస్య ఎదురైనా పోలీసుశాఖను సంప్రదించాలని, అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలందరూ తనకు సమానమేనని, ఎవరికైనా ఇబ్బంది ఎదురైతే నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజల సహకారంతో గణేష్ ఉత్సవాలు, శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా విజయవంతం చేద్దామని ఎస్పీ పిలుపునిచ్చారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, ప్రవీణ్, సమ్మయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గుడిసెలకు గుడ్ బై... పక్కా ఇళ్ల విప్లవం షురూ!

### ఎమ్మెల్యే రామారావు పటేల్



**బాసర, సెప్టెంబర్ 15 (జనం సాక్షి)** సొంతింటి కల కోసం ఎదురుచూస్తున్న పేదలకు తీపి కబురు. బాసర మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వేదికగా ఇందిరమ్మ ఇళ్ల పండుగ వాతావరణం నెలకొంది. మంగళవారం ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రామారావు పటేల్ చేతుల మీదుగా 107 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ ను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఒక్క గుడిసె కూడా లేకుండా చేస్తానని, దశల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతానని స్పష్టం చేశారు. అయితే, బాసర సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఓని సర్పంచ్ జగదీష్‌లు ఎమ్మెల్యే ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. బాసరలోనే 8 వేలకు పైగా జనాభా ఉందని, వచ్చిన 107 ఇళ్లు చాలా తక్కువని, మరిన్ని ఇళ్లు కేటాయించాలని కోరారు. వారి వినతికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, 10 రోజుల్లోనే బాసరకు అదనంగా మరిన్ని ఇళ్లు తీసుకొస్తానని బహిరంగ వేదికపై హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్, ఎంపీఓ గంగాసింగ్, ఏపీవో సదానంద చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృత్ పటేల్, నాయకులు పోగుల రాజేశ్వర్, సాల్వి రమేష్, సాకలి సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ వారోత్సవాలను విజయవంతం చేయాలి

### కమ్యూనిస్టు పార్టీలు ఏకతాటిపైకి రావాలి



**దేవరుప్పుల, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):** సీపీఐ వారోత్సవాల్లో భాగంగా దేవరుప్పుల మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆది సాయన్న ముఖ్యఅతిథిగా పాల్గొని, షేక్ బందగి స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న సీపీఐ వారోత్సవాలను గ్రామగ్రామాన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, పేదలు, సామాన్య ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కమ్యూనిస్టు పార్టీలు నిరంతరం ప్రజా పోరాటాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. బీజేపీ పాలనకు ముగింపు పలికేందుకు అన్ని కమ్యూనిస్టు పార్టీలు, వామపక్ష శక్తులు ఏకతాటిపైకి వచ్చి ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా సమస్యలపై విస్తృత స్థాయిలో పోరాటాలు నిర్వహిస్తూ, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు, యువత, మహిళల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేసి, ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సీపీఐ వారోత్సవాల సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటాలను ప్రజలకు వివరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల సామాన్య ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కల్పించాలని అన్నారు. ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, కార్మికులు--రైతుల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యామ్నాయ ప్రజా విధానాల సాధనకు కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా పోరాడాలని పేర్కొన్నారు. షేక్ బందగి పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమించాలని నాయకులు అన్నారు. ప్రజల హక్కుల కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారుల స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల శ్రీనివాస్, సీపీఐ నాయకులు సొప్పరి సోమన్న, ఆరెపల్లి రవి శ్రీనివాస్, బిల్లా తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక చవితి వేడుకలు

### స్టేషన్ ఘనపూర్ సబ్ స్టేషన్లో కొలువుదీరిన కరెంటోళ్ల గణనాథుడు



**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంతో పాటు, మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా గణపతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని 33/11కేవి విద్యుత్ ఉప కేంద్రంలో వరుసగా రెండో ఏట ఘనపూర్ టౌన్ ఏఈ (ఎన్పిడిసీఎల్) పగిడిముంతల శంకర్ ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహం ప్రతిష్టించి మొదటి రోజు పూజా కార్యక్రమం భక్తి, శ్రద్ధలతో నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో టౌన్ సెక్షన్ విద్యుత్ సిబ్బంది కుటుంబ సమే తంగా పాల్గొని గణనాథుని దీవెనలు అందు కున్నారు ఈ సందర్భంగా ఏఈ శంకర్ మాట్లాడుతూ వరుసగా రెండోసారి విఘ్నేశ్వరుడి సన్నిధిలో సేవలు అందించాల్సిన భాగ్యం లభించినదుకు హర్షంవ్యక్తంచేస్తూ, గణనాథు ని ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నారు,. ఈ ఏడు ఎల్నినో దుష్ప్రభా వం పడకుండా వినియోగదారులకు నిరంత రాయ,మెరుగైన సరఫరా జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ వడ్డేపల్లి యాదగిరి, లైన్మెన్ వాసం శ్రీధర్, యుగేందర్, సందీప్, మూర్తి,మల్లేష్,కుమార్,శ్రీను,అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం

### ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్





**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 15 (జనం సాక్షి):** విద్యార్థుల హక్కులు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరా టం కొనసాగిస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జనగామ జిల్లా 3వమహాసభ మహాసభ మహమ్మద్ యూనుస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి జెండాను ఆవిష్కరించారు. ఈ మహాసభను ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ తెలంగా ణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడు తూ విద్యా రంగంపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరిచే కుట్రలను తీవ్రంగా వ్యతిరేకించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అలాగే జీఓ నెంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధం గా ఉన్న నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, విద్యార్థుల హక్కుల సాధన కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మరింత బలమైన ఉద్యమాలను చేపట్టాలని మహాసభ పిలుపు నిచ్చింది. ఈ సమావేశం లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ గ్యార నరేష్, ఏఐఎస్ఎఫ్ జనగామ జిల్లా మాజీ నాయకు లు మహమ్మద్ రహమ తుల్లా, నాయకులు పృథ్వీరాజ్, అక్షయ్, జీవన్, దామెర రాము, బుస్సా రోహిత్, చింత నిఖిల్ తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం కావాలి


### కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :**కుడా పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతం కావాలని కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి అన్నారు మంగళవారం కుడా కార్యాలయం లో అభివృద్ధి పనుల పురోగతి మీద సంబంధిత అధికారులతో కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి రివ్యూ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కుడా పరిధిలో చేపట్టిన వరంగల్ బస్ స్టేషన్, ఇన్నర్ రింగ్ రోడ్, వేయి స్తంభాల గుడి అభివృద్ధి పనులు, ఉనికి చర్ల, హన్మకొండ చౌరస్తా రీ డెవలప్మెంట్ , ఔటర్ రింగ్ రోడ్, గ్రీనరి మొదలగు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. భూ సేకరణ చేయాలిసి ఉన్న అభివృద్ధి పనులకు సంబందించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు .ఈ సమావేశంలో కుడా పిఓ అజిత్ రెడ్డి, ఈ ఈ భీమ్ రావు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నాం

- ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- 272 మంది లబ్ధిదారులకు 1కోటి 5లక్షల 8250 రూ విలువ గల సిఎంఆర్ఆఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల, సెప్టెంబర్15, (జనం సాక్షి):** మంగళవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్,పరకాల, నడి కూడా, ఆత్మకూరు మరియు దామెర మండలాల పరిధిలోని 272 మంది లబ్ధిదారులకు 1కోటి 5లక్షల 8250 రూ విలువ గల సిఎంఆర్ఆఫ్ చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిలుస్తుంది అన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం పాలకుల వల్ల ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని అన్నారు. గత బి ఆర్ ఎస్ నాయకులు కళ్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి పథకంలో అక్రమాలు చేసారని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరల పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

# వాడ వాడల కొలువుదీరిన గణనాథులు

## ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామాల్లోని ప్రజలు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 15 ( జనం సాక్షి):** గ్రామాల్లో వాడవాడల గణనాథులు కొలువు తీరాయి. గణేష్ భజన మండలి నిర్వహణ కమిటీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపాలలో గణపతి నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని సోమవారం వినాయకులను ప్రతిష్టించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం ప్రజలు, భక్తులు గణనాథుల వద్ద పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా తీర్థప్రసాదాలను మంచిపెట్టారు. దీంతో గ్రామాలలోని వాడ వాడలా ఎటు చూసినా వినాయక చవితి పండుగ సందడి వాతావరణమే కనిపించింది.

## విద్యార్థులు యూనిఫామ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

### ఎల్లాయగూడెం గ్రామ సర్పంచ్ జినుకల కనకమల్లు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 15 ( జనం సాక్షి ):** విద్యార్థులు యూనిఫామ్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎల్లాయగూడెం గ్రామ సర్పంచ్ జినుకల కనకమల్లు అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లాయగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫాంల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫాంలను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరపున తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంగోత్ భద్రయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, యాకయ్య, రవిచంద్ర, పావని, అక్షయ, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మారాలి

### రైతులకు కిట్ల పంపిణి పాల్గొన్న వ్యవసాయ అధికారి వెంకట్



**కౌటాల సెప్టెంబర్ 15 జనం సాక్షి** ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని వెంకట్ అన్నారు. మండలంలోని రైతు వేదికలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ స్కీం కింద ఎంపిక చేయబడిన ముత్తంపేట్ రైతులకు కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, నీమాస్త్రం, అజ్ఞాస్త్రం, దశపర్ణి కషాయం తయారీ, పంటలకు ఉపయోగించే విధానం లాభాలు, ప్రకృతి సేద్యం చేయడం వల్ల కలిగే లాభాల పైన అవగాహన కల్పించడం జరిగింది, ప్రతి ఒక్క రైతు కూడా ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని తెలిపారు. పంటల వైవిధ్యం చెట్లు, పశువుల అనుసంధానం, నేలలో సేంద్రియ పదార్థం పెంచడం, కషాయాలు ద్రావణాలతో తెగుళ్ల వ్యాధుల యాజమాన్యం, ఎటువంటి వ్యవసాయ రసాయనాలు వాడకపోవడం తదితర అంశాలపై, రసాయన వ్యవసాయం చేయడం వలన కలిగే నష్టాల పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఘన్ శ్యామ్,.సాగర్, రాజేశ్వర్, రేష్మిత, కల్పనా, ఏఎంసీ డైరెక్టర్, సత్యనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ముత్యంపేట ఉపసర్పంచ్.రామకృష్ణ, నాయకులు బండు రావు, మోతిరాశీ, కృషి సఖీలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం - నేల ఆరోగ్యం : ఏవో శ్రీనివాస్




**పరకాల, సెప్టెంబర్15, (జనం సాక్షి):** నాగారం గ్రామంలో వ్యవసాయ శాఖ ద్వారా నేషనల్ మిషన్ అండ్ నేషనల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో పకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడం జరిగింది. ఎన్ ఎం ఎన్ ఎఫ్ పథకంలోని రైతులు రసాయనిక ఎరువులు పూర్తిగా వాడకుండా పకృతి వ్యవసాయం ద్వారా వరి పంటను సాగు చేయాలని రైతులు ఆరోగ్యంగా, నేల ఆరోగ్యం,మనం తినే పంటలు ఆరోగ్యంగా ఉండే విధంగా పకృతి వ్యవసాయం చేయాలని ఏవో శ్రీనివాస్ సూచించారు ఇట్టి కార్యక్రమంలో నాగారం సర్పంచి అరుగొండ రమాదేవి, పైడిపల్లి సర్పంచి రమేష్, ఉపసర్పంచ్ రజనీకర్,మార్కెట్ డైరెక్టర్ బిక్షపతి,ఏఈఓ కాటంరాజు,రైతులు, బిక్షపతి, రాజు, హరికృష్ణా,లక్ష్మారెడ్డి, తిరుపతి,అరుణ, సుజాత, మమత,రాజు, బిక్షపతి మొదలైన రైతులు పాల్గొన్నారు.

# గిరిజన హామీలపై కాంగ్రెస్ మౌనం

### 'గిరిజన బంధు'ను వెంటనే అమలు చేయాలి బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి

**నల్లబెల్లి, సెప్టెంబరు 15(జనంసాక్షి):** గిరిజన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం పాటిస్తుందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ గిరిజనుల ఓట్ల కోసం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును విస్మరిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా గిరిజన బంధు, ఎస్టీ కార్పొరేషన్ల ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా గిరిజన ప్రాంతాల్లో విద్య, రోడ్లు, తాగునీరు, భూముల అభివృద్ధి, ఉపాధి, గురుకులాల కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజనుల కోసం కేటాయించిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను శ్వేతపత్రం ద్వారా వెల్లడించాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్



వైఖరిని ప్రజల్లో ఎండగడతామని, గిరిజనుల హక్కుల కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని సారంగపాణి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బానోత్ హరినాథ్ సింగ్, సర్పంచులు జాటోత్ రవి, అర్రెమ్ సాంబయ్య, బాదావత్ మంజుల మంగీలాల్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మండల గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు 'నషా ముక్త్ విద్యాలయ' అవగాహన సదస్సు!

**పరకాల, సెప్టెంబర్ 15,(జనం సాక్షి):** పరకాల పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో విద్యార్థులకు పొగాకు, మద్యం, మాదకద్రవ్యాలు మరియు ఇతర వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు నషా ముక్త్ విద్యాలయ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పాఠశాల పరిసర ప్రాంతాలకు దూరంగా పొగాకు మరియు పొగాకు ఉత్పత్తుల సంబంధించి ఎటువంటి దుకాణాలు ఉండకూడదని తెలిపారు. వీటివల్ల విద్యార్థులు త్వరగా ఆకర్షణకు లోనై తద్వారా బానిసలుగా మారే అవకాశం ఉన్నందువల్ల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల విద్యార్థులకు మత్తు పదార్థాలకు దూరంగా పెట్టి భావితరాలకు బాటలు వేసిన విధంగా ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, విద్యా మరియు సామాజిక నష్టాలను వివరించడం జరిగింది. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన మరియు వ్యసన రహిత జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించడం జరిగింది.




అలాగే విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు మరియు సమాజంలో కూడా మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించడం జరిగింది. "మాదకద్రవ్యాలకు నో చెప్పండి -- జీవితానికి అవును చెప్పండి" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించడం జరిగింది.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జిల్లా కార్యదర్శి రాముడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న జాత పట్టణానికి మంగళవారం చేరుకుంది. ఆర్కే 1ఎ వద్ద గల అమరుల స్తూపం వద్ద నాయకులు ఇప్పకాయల లింగయ్య పార్టీ జెండా ఎగురవేశారు. అలాగే రామాలయంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ పూలమాల వేయగా కౌన్సిలర్ కౌడగోని సాంబయ్య జెండాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. సాయుధ పోరాటాన్ని రాజకీయంగా మలుపు తిప్పుకుంటూ స్వార్ధ రాజకీయాలు చేస్తున్న బిజెపి పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. నిజాములకు



వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ అమరవీరుల జీవిత చరిత్ర, కమ్యూనిస్టుల ప్రభావం నేటి తరానికి తెలియజేయడానికి ఈ జాత నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేంతవరకు ఈ పోరాటం ఆగదని హెచ్చరించారు. అనంతరం సాయిదా తెలంగాణ అమరుల గీతం సిడిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాగ మల్లేష్, రేగుంట చంద్రశేఖర్, ఎండి అక్బర్ అలీ, మిట్టపల్లి శ్రీనివాస్, వనం సత్యనారాయణ, కౌన్సిలర్లు శంకర్, ముని పాల్గొన్నారు.

## భర్త పై హత్యాయత్నం కేసులో మహిళకు 25000 జరిమాను

### నేరం రుజువు చేయడం కీలక పాత్ర పోషించిన సిబ్బందిని అభినందించిన సీపీ

**భీమిని సెప్టెంబర్ 15 జనం సాక్షి.** భర్తపై భార్య హత్యయత్నం చేసిన కేసులో కత్తెరసాల లక్ష్మి కి 25వేల జరిమానా విధించినట్లు ఎస్సై కోటేశ్వర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం భీమిని మండలం మల్లీ గ్రామానికి చెందిన కత్తెరసాల లక్ష్మి తన భర్త అయినా సత్తయ్య పై 20 21 ఆ ప్రయత్నానికి పాల్పడి రెండు కాళ్లపై దాడి చేయగా సత్తయ్య తల్లి శంకరమ్మ భీమిని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది అప్పటి ఎస్సై కొమురయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నేరస్తురాలిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయగా మంచిర్యాల అడిషనల్ అసిస్టెంట్ కోర్ట్ న్యాయమూర్తి రామ్మోహన్ రెడ్డి ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరం రుజువు కావడంతో 25 వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. నేరస్తురాలకి శిక్ష పడడంలో ముఖ్యపాత్ర వహించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంది రవీందర్ పదిమంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంలో కీలకపాత్ర పోషించారని. మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ పర్యవేక్షణలో సాక్షులను ప్రవేశపెట్టడంలో కీలకపాత్ర పోషించిన తాండూర్ సీఐ ఏ దేవయ్య సీడీఓ నరేంద్ర రమేష్ లైసెన్ ఆఫీసర్లు చుంచు వెంకటేశ్వర్లు గోవిందరావు లను రామగుండం సిపి అంబర్ కిషోర్జా అభినందించడం జరిగిందని ఎస్సై కోటేశ్వర్ తెలిపారు.

# మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం పర్వతగిరి

## వర్ధన్నపేట జోనల్ స్థాయి క్రీడ ఎంపికల నిర్వహణ



**పర్వతగిరి: సెప్టెంబర్ 15 (జనం సాక్షి)** ఈ నెల 18, 19 తేదీలలో వర్ధన్నపేట జోనల్ స్థాయి లో వివిధ క్రీడల్లో ఎంపికలు పర్వతగిరి మండలం కొంకపాక ఉన్నత పాఠశాలలో నిర్వహించబడును అని పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ భిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ జి ఎఫ్ ఐ ( స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) వర్ధన్నపేట జోనల్ సెక్రటరీ ఎండి మహబూబ్ పాషా మాట్లాడుతూ కోకో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో 14 సంవత్సరాలు మరియు 17 సంవత్సరాల బాల,బాలికలు క్రీడ ఎంపికల్లో పాల్గొనవచ్చు అని తెలిపారు. దీనిలో మొదటి రోజు బాలికలు రెండవ రోజు బాలురకు పోటీలు నిర్వహించబడును అని తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు పాఠశాల నుండి బోనోఫైడ్ సర్టిఫికెట్ మరియు ఆధార్ కార్డు జిరాక్సులు సమర్పించవలెను తెలిపారు. ఒక్కో విభాగం నుండి ముగ్గురు విద్యార్థులు పాల్గొనవలెనని తెలిపారు. ఈ పోటీలలో వర్ధన్నపేట పర్వతగిరి రాయపర్తి మండలాలకు చెందిన గవర్నమెంట్ మరియు ప్రైవేటు స్కూల్ పాఠశాలల విద్యార్థులు మాత్రమే పాల్గొనవలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ ఎం వెంకటేశ్వర్లు సెక్రటరీ జే రఘువీర్ ఎస్ జి ఎఫ్ ఐ వరంగల్ జిల్లా సెక్రటరీ పి అనిల్, ట్రెజరర్ ఎం వెంకటేశం వర్ధన్నపేట పర్వతగిరి రాయపర్తి మండలాల పీడీలు మరియు పీఈటీలు పాల్గొన్నారు.

# సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేసిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



ఆత్మకూర్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి): మంగళవారం రోజున ఆత్మకూరు మండలంకు చెందిన లబ్దిదారులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి పరకాల క్యాంప్ ఆఫీసులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆత్మకూరు మండలానికి చెందిన 56 మంది లబ్దిదారులకు 20, 58, 000 రూపాయల చెక్కులను పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి, జిల్లా నాయకులు కమలాపురం రమేష్, అంబాటి రాజస్వామి, ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, పరకాల నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షులు ఏరుకొండ రవీందర్ గౌడ్, మార్కా రజనీకర్, పరికరాల వాసు, అల్వాల రవి, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ ఉడుత రాజేందర్, నీరుకుళ్ళ గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ నీల రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అమరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం సూడి కృష్ణారెడ్డి

- అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి
- సాయుధ రైతాంగ పోరాట అమరవీరులకు సిపిఎం ఘన నివాళులు.




**గోవిందరావుపేట సెప్టెంబర్15:( జనం సాక్షి)** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల స్ఫూర్తితో మరో ఉద్యమాన్ని కొనసాగించాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఎం పార్టీ గోవిందరావుపేట మండల కమిటీ ఆధ్వర్యంలో పసర సిపిఎం పార్టీ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ కడారి నాగరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఈ సభకు కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భూమికోసం,భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం,దొరల దోపిడీ పీడన కి వ్యతిరేకంగా కొనసాగిందని అన్నారు. 1948 నుండి 51 వరకు భారత దేశ చరిత్రలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మరువలేనిదని అన్నారు. ఈ పోరాటంలో వేలాదిమంది మహిళలు చిత్రహింసలకు గురైనారని అనేకమంది ప్రాణాలు వదిలారని తెలిపారు. దొడ్డి కొమురయ్య, సాకలి ఐలమ్మ,నల్ల నరసింహులు టాను నాయక్, షేక్ బందగి లాంటి ఎందరో వీరులు నెలకొరిగారని ఈ పోరాట ఫలితంగా పది లక్షల ఎకరాల భూమి పంపిణీ జరిగిందని 4000 మంది ప్రాణాలు బలిదానం చేశారని తెలిపారు. వారి పోరాట ఫలితమే పదివేల గ్రామాలు విముక్తి చేయగలిగామని తెలిపారు. ఈ పోరాట ఫలితంగానే నిజాం ప్రభుత్వం తలవంచి తోక ముడిచిందని తెలిపారు. కానీ ఈరోజు చరిత్రకు సంబంధంలేని వారు చరిత్రను వక్రీకరిస్తూ హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తూ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇది హిందూ ముస్లిం పోరాటం కాదని ధరల దోపిడికి నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటమని ఏ గడపని అడిగిన సజీవ సాక్షాలు తెలంగాణలో కనపడతాయని ఆయన తెలిపారు. అందుకోసం నేడున్న పాలకులు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్ని ఐక్యం చేసి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల స్ఫూర్తితో మరో పోరాటానికి సన్నద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ.మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి,పొదిల్ల చిట్టిబాబు, జిల్లా కమిటీ సభ్యులు తీగల ఆగిరెడ్డి. గొంది రాజేష్,దుగ్గి చిరంజీవి, మండల కమిటీ సభ్యులు అంబాల మురళి, గుండు రామస్వామి ,కన్నోజు సదానందం, సామ చంద్రారెడ్డి,మంచాల కవిత, శాఖ కార్యదర్శి పల్లపు రాజు, శ్రీరామోజు సువర్ణ, బుర్ర శ్రీనివాస్ గౌడ్, రెడ్డి పురుషోత్తం, చిన్న పల్లి అశోక్, డాక్టర్ ఐలయ్య, కోయిల సులోచన, నిమ్మకంటి స్రవంతి,ఇలియాస్, కొమ్ము రాజు, గాజుల బిక్షం, పంజాల శ్రీనివాస్, ఎం శ్రీనివాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం



**టేకుమట్ల సెప్టెంబర్ 15 జనంసాక్షి** టెకుమట్ల రైతువేదికలో రామకృష్ణాపూర్ (టీ ) గ్రామస్తులకు ఆత్మ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, ప్రత్యామ్నాయ పంటలపై మండల వ్యవసాయాధికారి ఎం కళ్యాణి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గునిగంటి రజిని, ఉపసర్పంచ్ కె . నవీన్, సెర్ప్ ఎన్జీవో నోడల్ అధికారి ఎం . మణికుమార్ , వ్యవసాయ విస్తరణాధికారి పి . నాగరాణి, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఎం . కళ్యాణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడమే కాకుండా శాశ్వత ఆహారం అందించేందుకు ప్రకృతి వ్యవసాయం వరం లాంటిది. సేంద్రియ వ్యవసాయం వల్ల నేలలోని సూక్ష్మజీవుల పెరుగుదలకు దోహదపడి నేల సారవంతం అవుతుంది అని తెలిపారు. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం ఉండడం వలన రైతులు ఆరుతడి పంటలు సాగుచేయాలని రైతులు విచక్షణారహితంగా మందులు, పురుగుమందులు వాడడంవల్ల నేలసారం కోల్పోతుంది తెలిపారు. శర్ప్ నోడల్ అధికారి ఎం . మణికుమార్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. జీవామృతం, ఘన జీవమృతం పంట సేంద్రియ ఎరువుల తయారీ విధానాలను రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. రైతులకు సేంద్రియ వ్యవసాయంపై కిట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు

# రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- అక్టోబర్ 4న జిల్లా మేనేజింగ్ కమిటీ ఎన్నికలు
- జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 15(జనంసాక్షి).** భారత రెడ్‌క్రాస్ సొసైటీ ములుగు జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు బోర్డడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ ఆదేశాల మేరకు ములుగు జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలను అక్టోబర్ 4న నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా, నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం నిర్వహించాలని సూచించారు. అర్హులైన సభ్యులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ ఓటర్ల జాబితా పరిశీలన, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల అధికారిగా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ధర్మ నాయక్‌ను, ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్‌రావును నియమించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 19న తుది ఓటర్ల జాబితాతోపాటు ఎన్నికల ప్రకటన విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, ఒక్కో నామినేషన్‌కు తిరిగి చెల్లించని డిపాజిట్‌గా రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన, 26న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించి, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారని వెల్లడించారు. అవసరమైతే అక్టోబర్ 4న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా శాఖ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడి ఎన్నికను అదేరోజు నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# పోషకాహారమే సంపూర్ణ ఆరోగ్యం

## ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమలత



**నడికూడ సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** పోషకాహారమే సంపూర్ణ ఆరోగ్యమని, అది మానవ మనుగడకు ఎంతో ముఖ్య మని ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమలత అన్నారు మంగళవారం. నడికూడ మండలం ధర్మారం గ్రామ అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలతో పోషణ మా సం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోషక ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధా నోపాధ్యాయులు ఎస్డి నన్నేసాహెబ్, యుగంధర్, అంగన్వాడీ టీచర్ సంధ్య, పిల్లలు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భూ రీసర్వేపై రైతులకు అవగాహన

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి)** వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని వసంతపూర్ గ్రామంలో మంగళవారం భూ రీసర్వే ప్రక్రియపై గ్రామసభ నిర్వహించారుఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని రైతులకు రీసర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీసర్వే ద్వారా భూ హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పక్కాగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రీసర్వే ప్రక్రియలో రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీసర్వే సమయంలో రైతులు అధికారులకు సహకరించాలని, భూ వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు రీసర్వేకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అనంతరం వరంగల్ మండలంలోని కొత్తపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఫీల్డ్ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో కలిసి రీసర్వే ప్రక్రియను పరిశీలించి, భూముల సరిహద్దులు, సర్వే వివరాల నమోదు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, భూ వివరాల నమోదులో ఖచ్చితత్వం పాటించాలని అధికారులకు సూచించారు. రీసర్వే ద్వారా భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా స్పష్టమైన భూ రికార్డులు రూపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె కిషోర్ కుమార్, ఆర్డీవో సుమ, ఏడి సర్వే మరియు రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, వరంగల్, ఖిలా వరంగల్ తహసీల్దార్లు శ్రీకాంత్ ,ఇక్బాల్,తో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మను మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలి

## ఐద్వా జాతీయ కార్యదర్శి కనినిక గోష్



**దేవరుప్పుల సెప్టెంబర్ 15 (జనం సాక్షి)** సబ్కా సాత్ సబ్ నినాదాలకి బిజెపి పరిమితమైందని పోరాటాల ద్వారానే ప్రభుత్వం మెడలు వంచాలని ఐద్వా జాతీయ కార్యదర్శి కనినిక గోష్ అన్నారు. మంగళవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని వీరవానితుల స్ఫూర్తి యాత్ర పాలకుర్తిలో ప్రారంభ సందర్భంగా మండలంలోని ధర్మాపురం గ్రామంలోని దర్యానాయక్ కుటుంబాన్ని పరామర్శించి,అనంతరం కామారెడ్డిగూడెం షేక్ బందగీ స్మారక స్థూపంలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కడవెండి గ్రామంలోని దోడ్డి కోమురయ్య స్మారక స్థూపానికి,విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. నివాళులర్పించి,అనంతరం ఏర్పాటు చేసిన సభకు ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండి షబానా అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కనినిక గోష్, జాతీయ ఉపాధ్యక్షురాలు ఎస్ పుణ్యావతితో కలిసి వారు మాట్లాడుతూ 1946 సంవత్సరం నుండి 1951 సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల పాటు సాగిన సమరం మొదటి భూస్వాములు దొరలు జాగిన్దారులు నైజాంతో జరిగిన పోరాటం తర్వాత యూనియన్ సైన్యాలతో కొనసాగిందని,కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మహిళలపై అత్యాచారాలు, దాడులు అణిచివేత పెరగాయని,నాటి నైజాం కు నేటి బిజెపి ప్రభుత్వానికి తేడా ఏం లేదని,అప్పటి హైదరాబాద్ రాజ్యంలోని తెలంగాణ రైతాంగం తిరుగుబాటు చేశారని, కులమత ప్రాంతంగా భేదాలు లేకుండా ఆ పోరాటంలో ప్రజలు భాగస్వాములు అయ్యారని, పోరాట ఫలితంగా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో సెప్టెంబర్ 17న విలీనమైందని,చాకలి ఐలమ్మ పోరాటంతో ఉద్యమం మొదలై దొడ్డి కొమురయ్య అమరత్వంతో నైజాం రాజ్యం అంత అగ్గి రగులుకుందని,విసునూరు రాపాక రామచంద్ర రెడ్డిని గడగడ లాడించిన ఐలమ్మ, మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో నేటి బిజెపి ప్రభుత్వం పైన మహిళలు ఉద్యమించవలసిన అవసరం ఏర్పడిందని,కేంద్ర మంత్రి బండి సంజయ్ కూమరుడు బండి భగీరథ్ ను చేసిన పనికి రేవంత్‌రెడ్డి ఖండించాక పోవడం సిగ్గు చేటని అన్నారు. ఈ సాయిధ పోరాటంలో ఆర్ఎస్ఎస్ బిజెపి పాత్ర సున్నాఅని,తెలంగాణ రైతాంగ తిరుగుబాటులో ఆర్ఎస్ఎస్ బిజెపి పాత్ర లేదని ఐద్వ రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. హిందూ మహాసభ నాయకులు భూస్వాములకే వంత పాడారని,సాయిదా రైతాంగ పోరాటాన్ని హిందూ ముస్లింల మధ్య పోరుగా చిత్రీకరిస్తున్నారని,ఇది వారి వంకర బుద్ధికి నిదర్శనమని,ఉద్యమం దొరలు భూస్వామునకు జాబిందార్లకు వ్యతిరేకంగా రైతులు సబ్బండ వర్గాలు జరిగిన ఉద్యమాన్ని హిందూ దొరలు హిందూ ప్రజలను పిప్పి చేశారని,ముస్లిం రాజైన నిజాం హిందూదళల దోపిడీకి అండగా నిలబడాలని,ఈ వాస్తవాన్ని మరిపించి ఎన్నో ముస్లిం తగాదాగా చిత్రీకరించడం అంటే దొరల దోపిడీకి కొమ్ము కాయడమేనని,ప్రజా పోరాటాన్ని అవమానించడం రాజకీయ లబ్ధి కోసం బిజెపి చేస్తున్న వక్రీకరణ కుట్రను తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, టి జ్యోతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవేటి సరళ, కే ఆశలత, నలిగంటి రత్నమాల, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, బత్తుల హైమావతి, జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య, మోకు భవాని,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ,కెవిపిఎస్ సిఇసి పల్లెర్ల లలిత,సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేష్ నాయకులు చుంచు విజేందర్,బుడిద గోపి,జోగు ప్రకాష్ మండల కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి, నాయకులు కాసర్ల యాదిరెడ్డి, సిఐటియు నాయకులు బత్తిని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

## గుగులోత్ రామస్వామి నాయక్



**ఖానాపురం, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):** గిరిజనులకు ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశద్ధితో హామీలను అమలుపరిచి గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేయాలని బి ఆర్ స్ నాయకులు గుగులోత్ రామస్వామి నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖానాపురం మండలం, బుధరావుపేట్ గ్రామంలో గిరిజన బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రామస్వామి నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు గిరిజనులకు, ఎస్టీలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని మండిపడ్డారు. ఎస్టీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని విమర్శించారు. ఎస్టీ రిజర్వేషన్ ను 12 శాతంకి పెంచాలని, పెండింగ్‌లో ఉన్న జీవోను వెంటనే అమలు చేయాలని అన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని, గిరిజన బంధు, గిరిజన రైతులకు ఇస్తామన్న ఆర్థిక సహాయం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధరావుపేట్, ఖానాపూర్ మండలంలోని గిరిజన తండాలు, గూడేలలో నెలకొన్న రోడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, గిరిజన విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ లు, ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే ఇవ్వాలని అన్నారు. కెసిఆర్ హయాంలో గిరిజనులకు ఇచ్చిన గౌరవం, ఇప్పుడు లేదని, ఈ ప్రభుత్వం గిరిజన వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని వారు ఆరోపించారు. హామీలు నెరవేర్చని పక్షంలో తండాలు, గూడేల నుండి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచులు, మాజీ సర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు గిరిజన నాయకులు బీఆర్ఎస్ గిరిజన అధ్యక్షులు, యూత్ నాయకులు, గిరిజన సెల్ నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- అర్హులైన ప్రతి గిరిజన జర్నలిస్టుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి
- ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు కెమెరాలు, ప్రింట్ మీడియా జర్నలిస్టులకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలి



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 15(జనంసాక్షి).** గిరిజన జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న నేతృత్వంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా బానోత్ వెంకన్న మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హత కలిగిన ప్రతి గిరిజన జర్నలిస్టుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులు తమ వృత్తిలో భాగంగా అనేక ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో పనిచేస్తున్న గిరిజన జర్నలిస్టులకు కెమెరాలు, ప్రింట్ మీడియా జర్నలిస్టులకు ల్యాప్‌టాప్‌లు అందించాలని డిమాండ్ చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి జర్నలిస్టులకు అవసరమైన సాంకేతిక పరికరాలను అందించాలని కోరారు. గిరిజన జర్నలిస్టులకు వార్తా సేకరణ, డిజిటల్ మీడియా, కెమెరా వినియోగం, సాంకేతిక అంశాలపై ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని బానోత్ వెంకన్న కోరారు. మారుతున్న మీడియా పరిస్థితులకు అనుగుణంగా జర్నలిస్టులకు ఎప్పటికప్పుడు శిక్షణ అందిస్తే వృత్తిపరంగా మరింత నైపుణ్యం సాధించే అవకాశం ఉంటుందని అన్నారు. గిరిజన జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు త్వరగా చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు ఇళ్లు, సాంకేతిక పరికరాలు, శిక్షణ వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, జిల్లా సభ్యులు పోరిక సునీల్, బానోత్ యోగి, కేతిరి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.